


ఆర్ఎన్ఐ/2009/ 28733 స్థాపితం : 2003

# ఆంధ్రనాడు

తెలుగు దినపత్రిక

సంపుటి : 22 సంచిక: 59 తిరుపతి తేది : ఆదివారం 31 మే 2026 పేజీలు : 08 ధర : రూ.6 PUBLISHED FROM TIRUPATI, CHITTOOR, ANNAMAIAH, ANANTHAPUR DISRICTS



## మయన్మార్ అధ్యక్షుడు భారత్ పర్యటన

బుద్ధగయ (బీహార్) – ఆంధ్రనాడు, మే 30

మయన్మార్ అధ్యక్షుడు యూ మిన్ ఆంగ్ హ్లైంగ్ భారత్ పర్యటనలో భాగంగా శనివారం మొదటగా బీహార్‌లోని బోధ్‌గయాకు చేరుకున్నారు. ఈ విషయాన్ని విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టు ద్వారా వెల్లడించారు. మయన్మార్ అధ్యక్షుడిని బీహార్ విమానాశ్రయంలో ఆ రాష్ట్ర గవర్నర్, లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అత హస్నైన్ (రిటైర్డ్) ఆయనకు స్వాగతం పలికారు. ఇరు దేశాల మధ్య ఆధ్మాత్మిక, చారిత్రక, ప్రజల మధ్య సంబంధాలను ఈ పర్యటన ద్వారా మరింత బలోపేతం చేయనుంది అని రణధీర్ జైశ్వాల్ తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. కాగా, నేడు మయన్మార్ అధ్యక్షుడు

- మిగతా 2లో..

## కర్నాటక సీఎంగా డీకే శివకుమార్

- ప్రకటించిన కేపీసీసీ
- జూన్ 3న ప్రమాణస్వీకారం

బెంగళూరు– ఆంధ్రనాడు, మే 30

కర్నాటక తదుపరి ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ పగ్గాలు చేపట్టనున్నారు. శనివారం సాయంత్రం బెంగళూరులో జరిగిన కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో సీఎల్పీ నేతగా డీకే శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాజీ సీఎం సిద్ధరామయ్య డీకే పేరును ప్రతిపాదించగా ఎమ్మెల్యేలంతా సమర్థించారు. దీంతో కర్ణాటక కాంగ్రెస్ సీఎల్పీ నేతగా డీకే శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఏఐసీసీ పరిశీలకులు ప్రకటించారు. కాగా కేవలం పది నిమిషాల్లోనే సీఎల్పీ భేటీ ముగియడం గమనార్హం.

**జూన్ 3న ప్రమాణ స్వీకారం**

కర్నా టక కొత్త సీఎం డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారోత్సవం జూన్ 3న జరగనుంది. ఈ విషయాన్ని కర్నా టక కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు జీసీ చంద్రశేఖర్ ప్రకటిం చారు. కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం లోక్‌భవన్‌లో జరుగనుందన్నారు. ఈ కార్యక్రమాన్ని నిరాడంబరంగా నిర్వహించాలనే ఉద్దేశంతోనే సీఎం ప్రమాణస్వీకారోత్సవ వేదికను లోక్‌భవన్‌కు మార్చినట్టు చంద్రశేఖర్ తెలిపారు. ట్రాఫిక్ రద్దీ తలెత్తకుండా, ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు ఎవరు కూడా లోక్‌భవన్‌కు రావద్దన్నారు. పార్టీ నిర్ణయానికి అందరూ సహకరించాలని కోరారు.

**గవర్నర్ తో డీకే భేటీ**

లోక్‌భవన్‌లో శనివారం ఉదయం గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్‌తో డీకే శివకుమార్ భేటీ అయ్యారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపైనే



వీరిద్దరి మధ్య ప్రధానంగా చర్చ జరిగినట్టు సమాచారం. గవర్నర్ ఆదివారం ధర్మస్థలలో జరిగే ఉపరాష్ట్రపతి పర్యటనకు హాజరుకావాల్సి ఉన్న నేపథ్యంలో ఆయన బెంగళూరు వెళ్తున్నారు. గవర్నర్ అందుబాటులో ఉండరనే ఉద్దేశంతోనే, సీఎల్పీ సమావేశానికి ముందే డీకే ఆయనతో భేటీ అయినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

**మంత్రివర్గంలో సిద్ధరామయ్య తనయుడికి చోటు దక్కే అవకాశాలు**

శివకుమార్ సీఎం అయ్యాక, కొత్త మంత్రి వర్గంలో సిద్ధరామయ్య కుమారుడికి చోటు దక్కే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన అనంతరం ఢిల్లీకి వెళ్లిన సిద్ధరామయ్య, కొత్త క్యాబినెట్‌లో తన తరపున మంత్రుల



## మంత్రాలయం వద్ద విషాదం...

- తుంగభద్రలో ఐదుగురు గల్లంతు
- మృతుల్లో ఐదేళ్ల బాలుడు, హైదరాబాద్‌కు చెందిన తండ్రీకొడుకులు
- సత్యనారాయణ వ్రతం తర్వాత స్నానానికి వెళ్లి ప్రమాదం
- గల్లంతైన వారి కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు
- ప్రమాదం నుంచి బయటపడిన అపర్ణ

కర్నూలు– ఆంధ్రనాడు, మే 30

కర్నూలు జిల్లాలోని పుణ్యక్షేత్రం మంత్రాలయం వద్ద తీవ్ర విషాదం చోటుచేసుకుంది. నిన్న సాయంత్రం తుంగభద్ర నదిలో స్నానానికి దిగిన ఐదుగురు వ్యక్తులు గల్లంతయ్యారు. వీరిలో ఐదేళ్ల బాలుడు కూడా ఉండటంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు, గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసుల కథనం ప్రకారం, ఒకే కుటుంబానికి చెందిన బంధువులు మంత్రాలయంలో సత్యనారాయణ స్వామి వ్రతం కోసం హాజరయ్యారు. పూజ ముగిసిన తర్వాత, వారిలో ఆరుగురు సరదాగా స్నానం చేసేందుకు తుంగభద్ర నదిలోకి దిగారు. అయితే, నదిలో నీటి లోతును అంచనా వేయడంలో విఫలమవ్వడంతో పాటు, ప్రవాహం వేగంగా ఉండటంతో వారు నీటిలో కొట్టుకుపోయారు. ఈ ప్రమాదం నుంచి ఆదోనికి చెందిన అపర్ణ అనే మహిళ సురక్షితంగా బయట పడగా, మిగిలిన ఐదుగురు గల్లంతయ్యారు. గల్లంతైన వారిని హైదరాబాద్‌కు చెందిన సతీష్ (35), అతని కుమారుడు యువన్ చంద్ర (5), అనంతపురం జిల్లా ఉరవకొండకు చెందిన సంధ్య (22), మంత్రాలయానికి చెందిన రాఘవేంద్ర (25), ధను (23)గా గుర్తించారు. గత రాత్రి పొద్దుపోయే వరకు గజ ఈతగాళ్లు, స్థానిక జాలర్ల సహాయంతో గాలింపు చర్యలు కొనసా గించారు. గల్లంతైన వారి ఆచూకీ కోసం అధికారులు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనతో బంధువుల ఇంట తీవ్ర విషాదం నెలకొంది.

## అమరావతిలో అర్బన్ మొబిలిటీ ప్లానింగ్

- ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 61వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం
- భవిష్యత్ ప్రణాళికలపై చర్చ.. మొత్తం 18 ప్రతిపాదనలకు ఆమోదం
- హైకోర్టు భవనాల వద్ద రూ.547 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన
- అమరావతికి సొంత అగ్నిమాపక విభాగం, బిల్డింగ్ ట్రైబ్యునల్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్
- 9 జిల్లాలను కలుపుతూ అమరావతి ఎకనామిక్ రీజియన్ అభివృద్ధికి ప్రణాళిక



అమరావతి – ఆంధ్రనాడు, మే 30

అమరావతి రాజధాని నిర్మాణ పనుల్లో వేగం పెంచే దిశగా ముఖ్యమంత్రి చంద్ర బాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. శనివారం ఆయన అధ్యక్షతన జరిగిన 61వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో 18 కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేశారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రాజధానిలో పటిష్టమైన అర్బన్ మొబిలిటీ ప్లానింగ్ ఉండాలని అధికారులను ఆదేశిం చారు. సమావేశంలో భాగంగా, హైకోర్టు భవనాలకు సంబంధించి వివిధ మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.547.07 కోట్లు కేటాయించడానికి అథారిటీ ఆమోదం తెలిపింది. పర్యాటకాన్ని ప్రోత్స హించేందుకు పీపీపీ పద్ధతిలో జెయింట్ అబ్జర్వేషన్ వీల్ నిర్మాణానికి, భవన నిర్మాణ వివాదాల సత్వర పరిష్కా రానికి ప్రత్యేక బిల్డింగ్ ట్రైబ్యునల్ ఏర్పాటుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో పాటు, అమరావతిలో సమర్థవంత మైన అగ్నిమాపక నియంత్రణ కోసం సీఆర్డీఏకు సొంత ఫైర్ వింగ్ ఏర్పాటు చేసుకునేందుకు అంగీకరించారు. ఏలూరు నుంచి ప్రకాశం వరకు 9 జిల్లాలకు విస్తరించే అమరావతి ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనకు కూడా అంగీకారం తెలిపారు. రాజధానిలోని అన్ని భవనాలకు సెంట్రల్

- మిగతా 2లో..



## కోటి మంది లక్ష్యంగా ‘యోగాంధ్ర@ 2026’.

- జూన్ 21న కృష్ణా నదిపై సీఎం యోగా

అమరావతి – ఆంధ్రనాడు, మే 30

అఅంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్‌లో ‘యోగాంధ్రఏ2026’ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జూన్ 21న జరిగే ఈ వేడుకను విజయవంతం చేసేందుకు కోటి మంది ప్రజలను భాగస్వాములను చేయడమే లక్ష్యంగా కార్యాచరణ సిద్ధం చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో ఈ కార్యక్రమ నిర్వహణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా, జూన్ 21న రాజధాని అమరావతిలో 25 వేల మందితో రాష్ట్ర స్థాయి యోగా ఈవెంట్ నిర్వహించనున్నారు. కృష్ణా నదిపై కొత్తగా నిర్మించిన వంతెనపై జరిగే ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా పాల్గొంటారు. అదే రోజున అన్ని జిల్లా కేంద్రాల్లో వెయ్యి మంది చొప్పున యోగా కార్యక్రమాలను నిర్వహిస్తారు. వీటిలో మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొంటారు. జూన్ 7 నుంచి 14 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా యోగా వారోత్సవాలు జరగనున్నాయి. “ఒక జిల్లా – ఒక థీమ్”తో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తారు. పార్కులు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలతో పాటు రాష్ట్రంలోని 56 పర్యాటక కేంద్రాల్లో ప్రత్యేక యోగా సెషన్స్ ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు గాను ప్రతి జిల్లాకు రూ. 25 లక్షల చొప్పున నిధులు కేటాయించారు. ప్రస్తుతం ఉన్న 1.50 లక్షల మంది యోగా శిక్షకులకు అదనంగా మరో లక్ష మందికి శిక్షణ ఇచ్చి, వారిని కూడా

- మిగతా 2లో..

## పీఎం సేతు పథకం అమలులో ఏపీ ఫస్ట్..

- విశాఖ ఐటీఐ క్లస్టర్‌కు కేంద్రం ఆమోదం
- పీఎం సేతు పథకం అమలులో దేశంలోనే తొలి రాష్ట్రంగా నిలిచిన ఆంధ్రప్రదేశ్
- విశాఖపట్నం ఐటీఐ క్లస్టర్ ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం
- ఆర్సెలర్ మిట్టల్, నామ్‌టెక్ భాగస్వామ్యంతో ఐటీఐల ఆధునికీకరణ
- పరిశ్రమల అవసరాలకు తగిన నైపుణ్య శిక్షణ అందించడమే లక్ష్యం
- దేశవ్యాప్తంగా 1000 ఐటీఐలను అభివృద్ధి చేసేందుకు రూ. 60,000 కోట్ల పథకం

2లో

## ఆర్టీసీని ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదు

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి
- ఏపీఎస్ఆర్టీసీని ప్రైవేటీకరించబోతున్నారంటూ ప్రచారం
- నిరసనలకు దిగిన ఎంప్లాయీస్ యూనియన్
- ఆర్టీసీని ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదన్న మంత్రి

అమరావతి – ఆంధ్రనాడు, మే 30



ఆంధ్రప్రదేశ్‌లో ఏపీఎస్ఆర్టీసీ ప్రైవేటీ కరణ కాబో తోందంటూ గత కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ప్రైవేటీకరణ వార్తల నేపథ్యంలో ఆర్టీసీ కార్మికులు

- మిగతా 2లో..

# కర్నాటక సీఎంగా డీకే శివకుమార్

(మొదటి పేజీ తరువాయి)

జాబితాను పార్టీ అగ్రనేతలు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ పరిశీలన కోసం అందించారు. అందులోనూ తన కుమారుడు, ఎమ్మెల్సీ డాక్టర్ యతీంద్రకు ఉపముఖ్యమంత్రి పదవితోపాటు, కీలక శాఖలు కేటాయించాలని ప్రత్యేకంగా కోరినట్టు తెలుస్తోంది. ఇక్కడ మరోకీలక అంశం ఏమిటంటే.. సిద్ధరామయ్య ప్రభుత్వంలోని మంత్రుల్లో దాదాపు సగం మందికి కొత్త మంత్రివర్గంలో చోటు దక్కకపోవచ్చని సమాచారం. మరోపక్క కర్నా టక కాంగ్రెస్ సర్కార్‌పై బీజేపీ ఎంపీ, మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై శనివారం విమర్శల వర్షం కురిపించారు. కొత్త సీఎం ప్రమాణ స్వీకారం చేయడం వల్ల సామాన్య ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని అన్నారు. అసలు రాష్ట్రంలో అర్థవంతమైన మార్పు వచ్చే అవకాశమే లేదని అభిప్రాయపడ్డారు.

మంత్రిమండలి రద్దు

సిద్ధరామయ్య రాజీనామాను గవర్నర్ థావర్చంద్ గెహ్లోత్ ఆమోదించడంతో పాటు మంత్రి మండలిని కూడా రద్దు చేశారు. అయితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పూర్తయ్యే వరకు సిద్ధరామయ్యను ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని కోరారు. కాగా డీకే శివకుమార్ ను కొత్త ముఖ్యమంత్రిగా ఎన్నుకోవడంతో కర్నాటక సీఎం అంశం పరిష్కారమైంది. ఇక రాజ్యసభ నామినేషన్లు, ఎమ్మెల్సీ పదవులతో సహా కీలక నియామకాలను ఖరారు చేసేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు చేస్తోంది.

# మయన్మార్ అధ్యక్షుడు భారత్ పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

బీహార్‌లోని గయా జిల్లాలో ఉన్న బౌద్ధుల పుణ్య క్షేత్రాల్లో ఒకటైన మహాబోధి ఆలయాన్ని సందర్శించనున్నారు. ప్రధాని మోడీ ఆహ్వానం మేరకు యూ మిన్ భారత్ పర్యటన మే 30 -- జూన్ 2 వరకు కొనసాగతుంది. యూమిన్ భారత్ పర్యటన ఇదే తొలిసారి. జూన్ 1వ తేదీన ఢిల్లీలో ప్రధాని మోడీతో ఈయన సమావేశం కానున్నారు. ఇరు నేతలు ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించుకోనున్నారు. జూన్ 2వ తేదీన దేశ ఆర్థిక రాజధాని ముంబైలో పారిశ్రామికవేత్తలతో సమావేశం కానున్నారు.

# అమరావతిలో అర్బన్ మొబిలిటీ ప్లానింగ్

(మొదటి పేజీ తరువాయి)

కూలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, ప్రతి టౌన్‌షిప్‌లో ఆర్థిక కార్యకలాపాలు ఉండేలా చూడాలని సీఎం సూచించారు. వీటితో పాటు సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్, ఎల్పీఎస్ లేఅవుట్లలో ఏటీఎంల ఏర్పాటు, 495 మంది రైతులకు రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు వంటి పలు అంశాలను అథారిటీ ఆమోదించింది. ఈ సమావేశంలో పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ, సీఎస్ జి. సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కోటి మంది లక్ష్యంగా 'యోగాంధ్ర @ 2026'




(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్రమంలో భాగం చేయనున్నారు.

**ప్రజలకు అందుబాటులో యోగా వీడియోలు**

ఈ సందర్భంగా, రాష్ట్ర ప్రభుత్వ యోగా, నాచురోపతి విభాగ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు రూపొందించిన 'యోగాంధ్ర' పోస్టర్‌ను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. వివిధ ఆసనాలు, ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలపై తాను రూపొందించిన వీడియోలను ప్రజలకు ఉచితంగా అందుబాటులో ఉంచుతున్నట్లు మంతెన తెలిపారు. 8142404888 నంబర్‌కు 'ఎఱ' అని మెసేజ్ పంపడం ద్వారా లేదా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఈ వీడియోలను పొందవచ్చని వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రులు నారాయణ, సత్యకుమార్, ఆనం రామనారాయణ రెడ్డి, కందుల దుర్గేష్, సీఎస్ సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆర్టీసీని ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదు

(మొదటి పేజీ తరువాయి)

ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంప్లాయిస్ యూనియన్ నిరసనలు చేపట్టింది. ఈ నిరసనల్లో వైసీపీ కూడా పాల్గొంది. మరోవైపు, ఈ ప్రచారంపై రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి స్పష్టమైన క్లారిటీ ఇచ్చారు. ఆర్టీసీని ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి ఎంతమాత్రం లేదని మంత్రి స్పష్టం చేశారు. ఏపీఎస్ఆర్టీసీ ఆర్థికంగా నిలకడగా ఉందని, సంస్థకు రూ. 30 వేల కోట్ల ఆస్తులు ఉన్నాయని తెలిపారు. అంతేకాకుండా, ఆర్టీసీ ప్రయాణ ఛార్జీలను పెంచే ఉద్దేశం కూడా లేదని ప్రయాణికులకు తీపి కబురు చెప్పారు. సంస్థను మరింత ఆధునికీకరించేందుకు త్వరలోనే కొత్తగా 2,500 ఎలక్ట్రిక్, 500 సీఎన్జీ బస్సులను ప్రవేశపెట్టబోతున్నట్లు మంత్రి ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు, కార్మికుల సమస్యలన్నింటినీ రెండేళ్లుగా పరిష్కరిస్తూ వస్తున్నామని చెప్పారు. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న అవసరమైన ఉద్యోగాలను కూడా త్వరలోనే భర్తీ చేస్తామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి హామీ ఇచ్చారు.

# అశ్వవాహనంపై కల్కి అవతార వైభవం

## కలిదోష నివారణ సందేశంతో భక్తులను అనుగ్రహించిన గోవిందరాజస్వామి





**తిరుపతి– ఆంధ్రనాడు, మే 30**

తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో శనివారం రాత్రి అశ్వవాహన సేవ అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీ గోవిందరాజస్వామివారు కల్కి అవతార అలంకారంలో అశ్వవాహనంపై విహరించి భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. వాహనం ముందు గజరాజులు గంభీరంగా నడుస్తుండగా, భక్త బృందాల కోలాటాలు, మంగళ వాయిద్యాల నాదాలు, గోవింద నామస్మరణల మధ్య స్వామివారి వాహనసేవ ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపింది. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పిస్తూ స్వామివారి దివ్య మంగళ రూపాన్ని దర్శించుకుని పరవశించిపోయారు. ఉపనిషత్తులు ఇంద్రియాలను గుర్రాలతో పోలుస్తాయి. అశ్వవాహనంపై కల్కి స్వరూపంలో దర్శనమిచ్చిన స్వామివారు, కలియుగ దోషాలకు దూరంగా ఉండి భగవన్నామ సంకీర్తన, ధర్మాచరణలను ఆశ్రయించి జీవితాన్ని సార్థకం చేసుకోవాలని సందేశమిచ్చారు. ఈ వాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో శ్రీమతి వి.ఆర్.శాంతి, ఏఈఓ శ్రీ ఏ.బీ.నారాయణ చౌదరి, సూపరింటెండెంట్ శ్రీ చిరంజీవి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ ధనంజయులు, అర్చకులు, అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.







# పీఎం సేతు పథకం అమలులో ఏపీ ఫస్ట్..

- విశాఖ ఐటీఐ క్లస్టర్‌కు కేంద్రం ఆమోదం
- పీఎం సేతు పథకం అమలులో దేశంలోనే తొలి రాష్ట్రంగా నిలిచిన ఆంధ్రప్రదేశ్
- విశాఖపట్నం ఐటీఐ క్లస్టర్ ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం
- ఆర్సెలర్ మిట్టల్, నామ్‌టెక్ భాగస్వామ్యంతో ఐటీఐల ఆధునికీకరణ
- పరిశ్రమల అవసరాలకు తగిన నైపుణ్య శిక్షణ అందించడమే లక్ష్యం
- దేశవ్యాప్తంగా 1000 ఐటీఐలను అభివృద్ధి చేసేందుకు రూ. 60,000 కోట్ల పథకం



**అమరావతి - ఆంధ్రనాడు, మే 30**

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రధాన మంత్రి స్కిల్లింగ్ అండ్ ఎంప్లాయబిలిటీ ట్రాన్స్‌ఫర్మేషన్ త్రూ అప్‌గ్రేడెడ్ ఐటీఐస్ (పీఎం–సేతు) పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి రాష్ట్రంగా నిలిచింది. ఈ పథకం కింద విశాఖపట్నం ఐటీఐ క్లస్టర్‌కు సంబంధించిన వ్యూహాత్మక పెట్టుబడి ప్రణాళికకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని జాతీయ స్టీరింగ్ కమిటీ (చీూజ) ఆమోదముద్ర వేసింది. దేశవ్యాప్తంగా పీఎం–సేతు కింద ఆమోదం పొందిన తొలి ప్రాజెక్టు ఇదే కావడం విశేషం. ప్రముఖ ఉక్కు తయారీ సంస్థ ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా , న్యూ ఏజ్ మేకర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నామ్‌టెక్)తో కలిసి ఈ ప్రాజెక్టును అమలు చేయనుంది. ఈ భాగస్వామ్యం ద్వారా విశాఖపట్నంలోని ప్రభుత్వ ఐటీఐలను 'హబ్ అండ్ స్పోక్' నమూనాలో ఆధునికీకరిస్తారు. పరిశ్రమల ప్రస్తుత, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సాంకేతిక శిక్షణ అందిస్తారు. 'వికసిత్ భారత్ 2047' లక్ష్యాల్లో భాగంగా, దేశవ్యాప్తంగా 1,000 ప్రభుత్వ ఐటీఐలను ఆధునికీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం రూ. 60,000 కోట్ల బడ్జెట్‌తో ఈ పథకాన్ని ప్రారంభించింది. కోర్సు పూర్తయిన వెంటనే విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. ఆంధ్రప్రదేశ్‌లో ఈ పథకం మొదటగా ప్రారంభం కానుండటంతో, ఇది ఇతర రాష్ట్రాలకు ఒక నమూనాగా నిలుస్తుందని అధికారులు భావిస్తున్నారు.

# ముత్యాల పందిరి కింద గీతామృతం పంచిన కల్యాణ శ్రీనివాసుడు

- గీతోపదేశ కృష్ణుడి అలంకారంలో భక్తులను కరుణించిన స్వామివారు





**తిరుపతి– ఆంధ్రనాడు,,మే 30**



నారాయణవనంలోని శ్రీ పద్మావతి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన శనివారం రాత్రి ముత్యపుపందిరి వాహనసేవ అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అనంత తేజోమూర్తి శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారు కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునునికి గీతోపదేశం చేస్తున్న శ్రీకృష్ణ పరమాత్మ స్వరూపంలో ముత్యపుపందిరి వాహనంపై దివ్యంగా దర్శనమిచ్చి భక్తులను అనుగ్రహించారు. స్వామివారి దివ్య మంగళ విగ్రహం, ముత్యాల కాంతుల మధ్య ప్రకాశిస్తూ భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. ముత్యపుపందిరి వాహనం శాంతి, శీతలత్వం, పవిత్రతకు ప్రతీకగా భావించబడుతుంది. ముత్యాల చల్లని నీడలో విహరించిన శ్రీనివాసుని దర్శనం భక్తుల తాపత్రయాలను తొలగించి, వారి జీవితాల్లో ఆధ్యాత్మిక ప్రశాంతతను నింపుతుందని ఆగమ శాస్త్రాలు పేర్కొంటున్నాయి. ఈ వాహనసేవలో సూపరింటెండెంట్ శ్రీ శ్రీనివాసులు రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీ నాగరాజు, శ్రీ చెంగల్రాయులు, ఆలయ అర్చకులు, అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలను పొందారు.

# ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు



**పెద్దపంజాణి, ఆంధ్రనాడు, మే 30 :** మండలంలోని రాజుపల్లెలో వున్న ఎస్పీఎం చర్చి ఫాదర్ శ్యాముల్ ఆధ్వర్యంలో శనివారం వేసవి సెలవుల్లో విద్యార్థులకు వ్యాసరచన, ఆటలపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటిశీచాలి



**రేణిగుంట – ఆంధ్రనాడు, మే 30 :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు , ప్రముఖ సినీ నటుడు కీర్తిశేషులు నందమూరి తారక రామారావుకు భారతరత్న బిరుదు ప్రకటించాలని, రేణిగుంట తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ డి. పుష్పనాదం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా మండల కేంద్రమైన రేణిగుంట పట్టణంలో మినీ మహానాడు కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయడానికి పుష్పనాదం ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. 1983 వ సంవత్సరం ఉమ్మడి రాష్ట్రాల్లోతెలుగుదేశం పార్టీ స్థాపించి, ఎన్నికల్లో అధికారం సాధించి ముఖ్యమంత్రి గా ఎదిగి పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించిన ఘనత ఎన్టీ రామారావు కె దక్కిందని, పుష్ప నాదన్ అన్నారు. ఆనాటి నుంచి నేటి వరకు ఇరు రాష్ట్రాల్లో నందమూరి తారక రామారావు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని ఆయన అన్నారు. నందమూరి తారక రామారావు ఆశయ సాధనలో భాగంగా నేటి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తోపాటు రాష్ట్ర మంత్రులు, శ్రీకాళహస్తి శాసనసభ్యుడు, బొజ్జల సుధీర్ రెడ్డి తోపాటు రాష్ట్ర ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులో పరిపాలన సాగిస్తున్నారని పుష్పనాథన్ హర్షం వ్యక్తం చేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి..

**- మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి**




**కార్వేటినగరం – ఆంధ్రనాడు, మే 30 :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ పార్టీ తరపున సత్తా చాటాలని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. ఎస్ ఆర్ పురం మండలం కొత్తపల్లి మిట్ట లోని దీపిక కళ్యాణమండపంలో ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా పార్టీ అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ పార్టీ తరపున ప్రతి పంచాయతీలో ఎన్నికలలో పోటీ చేసి గెలుపొందాలని కార్యకర్తలకు సూచించారు. బూతు లెవల్ ఏజెంట్లు గ్రామస్థాయి ఓట్లలో అవకతవకలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకలను, రెడ్ బుక్ అమలు, అక్రమ కేసులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్త నాయకులు గ్రూపు రాజకీయాలకు స్వస్తి పలికి రాబోయే 2029 ఎన్నికల్లో మళ్ళీ జగన్ ను సీఎం చేసేలా కష్టపడి పనిచేయాలని మాజీ డిప్యూటీ సీఎం నారాయణ అన్నారు. బిఎల్ఎ, వైసిపి పార్టీ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని జీడి నెల్లూరు నియోజకవర్గ ఇన్చార్జ్ కృపా లక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గస్థాయి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# హనుమంతు సేవలు అమోఘం : ఆర్డీఓ భవాని



**పెద్దపంజాణి, ఆంధ్రనాడు, మే 30 :** పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పెద్ద పంజాణి మండలం తహసీల్దారుగా,పనిచేసిన హనుమంతు నాయక్, డిప్యూటీ తహసిల్దార్‌గా పనిచేసిన రమేష్ బాబు పదవీ విరమణ వీడ్కోలు సమావేశం శనివారం స్థానిక తహసిల్దార్ కార్యాలయ ఆవరణంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కార్యాలయం సిబ్బంది వారిని ఘనంగా సన్మానించారు. ఈ వీడ్కోలు కార్యక్రమానికి పలమనేరు ఆర్డీఓ భవాని హాజరైనారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు నిబద్ధతతో ప్రజలకు చేసిన సేవలే అధికారులకు గుర్తింపునిస్తాయని పదవీ విరమణ తర్వాత వారి జీవితాన్ని ఆరోగ్యంగా కుటుంబంతో సంతోషంగా గడపాలని కోరుకుంటున్నట్లు అన్నారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్, యుగేష్ రెడ్డి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాకేష్ కుమార్ తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ తో ఉన్న అనుబంధాన్ని వారి నుంచి నేర్చుకున్న విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామ్మూర్తి, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది తెదేపా నాయకులు ఏఎంసీ డైరెక్టర్ మాడి శంకరప్ప, రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

# దిగువ పుత్తూరులో దళితులు ఇంటి స్థలాల కోసం డిమాండ్..

**- ప్రభుత్వ భూమి కేటాయించాలని సీపీఎం విజ్ఞప్తి**



**కేవీబీపురం – ఆంధ్రనాడు, మే 30 :** మండలంలోని దిగువ పుత్తూరు గ్రామంలో ప్రభుత్వ భూమిని దళితుల ఇంటి స్థలాలు, సామాజిక అవసరాల కోసం కేటాయించాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 61/2పీ లో సుమారు 19 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, అందులో ఇప్పటికే 12 ఎకరాలకు పైగా వివిధ అవసరాల కోసం వినియోగంలో ఉందని, మిగిలిన 7 ఎకరాల భూమిని దళిత కుటుంబాల భవిష్యత్ అవసరాలకు కేటాయించాలని సీపీఎం జిల్లా వర్గ సభ్యుడు దాసరి జనార్ధన్ డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం మండల కార్యదర్శి నాగలాపురం నాగరాజు, స్థానిక దళితులతో కలిసి ఆ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా దాసరి జనార్ధన్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రభుత్వ భూములపై ప్రతి వర్గానికీ సమాన హక్కులు ఉన్నాయని, బలహీన వర్గాలకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే గ్రామంలో పాఠశాల, ఇంటి స్థలాలు, గిరిజనుల అవసరాలు తదితర ప్రయోజనాల కోసం భూములు కేటాయిం చబడిన విషయాన్ని గుర్తుచేస్తూ, మిగిలిన భూమిని కూడా నిరుపేద దళిత కుటుంబాలకు కేటాయించడం సామాజిక న్యాయానికి అనుగుణమని పేర్కొన్నారు. భూమి వివాదం నేపథ్యంలో అధికారులు విధించిన నిషేధాజ్ఞలపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించి, అర్హులైన దళిత కుటుంబాలకు ఇంటి స్థలాలు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. రెవెన్యూ అధికారులు పరిస్థితిని సమగ్రంగా పరిశీలించి, ప్రభుత్వ భూముల వినియోగంలో సామాజిక సమానత్వం పాటించేలా నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో భూమిలేని నిరుపేద కుటుంబాలకు ఇంటి స్థలాలు అందించడం ద్వారా వారి జీవన భద్రతకు తోడ్పాటు అందించవచ్చని స్థానికులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో గ్రామస్తులు రవి, గోపి తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రనాడు కథనానికి స్పందించిన అధికారులు...

## ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల వద్ద అనధికార ఫ్లెక్సీల తొలగింపు



**కేవీబీ పురం – ఆంధ్రనాడు, మే 30:** మండల కేంద్రంలోని ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల వద్ద ప్రభుత్వ సూచిక బోర్డులపై అనధికారికంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లను అధికారులు తొలగించారు. ఆంధ్రనాడు పత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు శనివారం ప్రత్యేక చర్యలు చేపట్టి ప్రచార ఫ్లెక్సీలను తొలగించారు. ప్రభుత్వ కార్యాలయాల గుర్తింపు కోసం ఏర్పాటు చేసిన సూచిక బోర్డులను రాజకీయ, వ్యక్తిగత ప్రచారాలకు వినియోగించడం సరైన పద్ధతి కాదని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాలు, సూచిక బోర్డులు ప్రజా ప్రయోజనాల కోసం మాత్రమే వినియోగించాల్సి ఉంటుందని తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయడం నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. ఇకపై ప్రభుత్వ కార్యాలయాల వద్ద లేదా ప్రభుత్వ ఆస్తులపై ఎవరైనా అనధికారికంగా ప్రచార సామగ్రిని ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# అమ్మవారి ఆలయ దబేదర్‌కు ఘన వీడ్కోలు

**- ఆలయ మర్యాదలతో సత్కారం**



**తిరుచానూరు – ఆంధ్రనాడు, మే 30:** తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి దేవస్థానంలో సుదీర్ఘకాలం పాటు నిబద్ధతతో సేవలందించిన ఆలయ దబేదర్ టి. సత్యనారాయణ పదవీ విరమణ సందర్భంగా శనివారం ఆలయ అధికారులు అర్చకులు ఘనంగా వీడ్కోలు పలికారు. టీటీడీలో వివిధ విభాగాల్లో పలు హోదాల్లో బాధ్యతలు నిర్వహించిన ఆయన, చివరిగా అమ్మవారి ఆలయ దబేదర్‌గా సేవలను పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, సహచర ఉద్యోగులు కలిసి ఆయనను ఘనంగా సత్కరించారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం అమ్మవారి శేషవస్త్రాలు, ప్రత్యేక ప్రసాదాలను అందజేసి గౌరవించారు. అలాగే శాలువాలు కప్పి పదవీ విరమణ పొందిన దబేదర్ సేవలను కొనియాడుతూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్లు సురేష్, ముని చెంగల్రాయలు, ఇన్స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మంగంపేటలో భూ సేకరణ పనుల పరిశీలించిన జెసి


**- అగ్రహారం ఆర్‌ఆర్-2 గ్రామాన్ని సందర్శించి సమస్యలపై గ్రామస్తులతో చర్చ**



**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 30:** తిరుపతి జిల్లా, ఓబులవారిపల్లె మండలం, మంగంపేటలోని ఏపీఎండీసీ గనులు, భూ సేకరణ పనులను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు శనివారం పరిశీలించారు. కాలుష్య ప్రభావంతో తరలింపునకు గురవుతున్న అగ్రహారం ఆర్‌ఆర్–2 గ్రామాన్ని సందర్శించిన ఆయన గ్రామస్తులతో సమావేశమై పునరావాసం, గ్రామ తరలింపు ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు. గ్రామ తరలింపునకు సంబంధించి ఇప్పటివరకు చేపట్టిన భూ సేకరణ పనులను పరిశీలించి అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో రామ్మోహన్, తహసీల్దార్ యామిని మ్యాప్ ద్వారా భూ సేకరణ పురోగతిని వివరించారు. అనంతరం మంగంపేట ఏపీఎండీసీ ముగ్గురాయి గనులను సందర్శించిన జాయింట్ కలెక్టర్‌కు అక్కడి ఖనిజ సంపద, గనుల నిర్వహణపై ఏపీఎండీసీ చీఫ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ గోపీనాథ్ వివరించారు. కార్యక్రమంలో రెవెన్యూ, ఏపీఎండీసీ అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# స్వర్ణ గ్రామం ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా

**- కలెక్టరేట్‌లో ఇంటర్వ్యూలు**






**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 30 :** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు స్వర్ణ గ్రామం–స్వర్ణ వార్డు ఆధ్వర్యంలో తిరుపతి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ఉద్యోగ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రముఖ నియామక సంస్థ 2 కంస్ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా టాటా ఎలక్ట్రానిక్స్, ఇన్ఫోసిస్, యాక్సెంచర్, వెస్ట్‌సైడ్ తదితర సంస్థల్లో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు చేపట్టారు. కౌశలం ఆన్‌లైన్ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులు పాల్గొన్నారు. మే 30 నుంచి జూన్ 3 వరకు జరిగే ఈ ఇంటర్వ్యూలలో తొలి రోజు 211 మంది యువతీ యువకులు హాజరయ్యారు. జూన్ 3న తుది ఎంపిక జాబితాను ప్రకటించి నియామక ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్వర్ణ గ్రామం–స్వర్ణ వార్డు అధికారి బి. గంగా భవాని, కో-ఆర్డినేటర్ పి.వి. జగదీష్, సహాయ కో-ఆర్డినేటర్ సయ్యద్ అయాజ్ బాష తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య రక్షణకు పొగాకు విరమణే మార్గం

**- ప్రపంచ పొగాకు వ్యతిరేక ర్యాలీలో డీఎంహెచ్ఓ**




**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 30:** ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం తిరుపతిలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాల కూడలి వరకు సాగిన ఈ ర్యాలీని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వి. బాలకృష్ణ నాయక్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాల కూడలి వద్ద మానవహారం నిర్వహించి పొగాకు నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ, పొగాకు వినియోగం వల్ల నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో పాటు అనేక ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. పొగాకు సేవించే వారితో పాటు వారి చుట్టుపక్కల ఉన్నవారు కూడా పరోక్ష ధూమపానం కారణంగా ఆరోగ్య సమస్యలకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. పొగాకు అలవాటు ఉన్నవారు వెంటనే ఆ వ్యసనం నుంచి బయటపడేందుకు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రూప్‌కుమార్, డీపీఎంఓ డాక్టర్ ఛత్రప్రకాశ్‌రెడ్డి, స్టాటిస్టికల్ ఆఫీసర్ నాగేంద్రకుమార్, డిప్యూటీ డెమో బలరామరాజు, జిల్లా ప్రోగ్రాం అధికారులు, కార్యాలయ సిబ్బంది, నర్సింగ్ కళాశాల విద్యార్థినులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇజ్రాయెల్‌లో ఉద్యోగాలు.. రూ.1.99 లక్షల జీతం




**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 30:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్డీసీ) ఆధ్వర్యంలో ఇజ్రాయెల్ దేశంలో హోమ్ బేస్డ్ కేర్ గివర్ ఉద్యోగాల భర్తీకి అర్హులైన యువతీ యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్. లోకనాథం తెలిపారు. ఈ ఉద్యోగాలకు జీడీఏ, ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్, పోస్ట్ బీఎస్సీ నర్సింగ్ అర్హత కలిగిన 25 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు సుమారు రూ.1.99 లక్షల వేతనం లభిస్తుందని తెలిపారు. ఉద్యోగ ఒప్పంద కాలం రెండేళ్లు ఉంటుందని, ఎంపిక ప్రక్రియను ఆన్‌లైన్ ఇంటర్వ్యూ, వీడియో రికార్డింగ్ ద్వారా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు జూన్ 30లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని తమ బయోడేటాను skillinternational@apssdc.in కు పంపాలని, మరిన్ని వివరాలకు 9160912690, 9988853335 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో కోరారు.

# తుడా టవర్స్‌పై ప్రత్యేక దృష్టి

**- నిర్మాణ పనులను పరిశీలించిన చైర్మన్**
**- నాణ్యతలో రాజీ లేదన్న తుడా చైర్మన్ డా. డాలర్స్ దివాకర్ రెడ్డి**



**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 30:** పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతి నగరానికి తలమానికంగా, అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మితమవుతున్న 'తుడా టవర్స్' నిర్మాణ పనులను తుడా చైర్మన్, టీటీడీ ఎక్స్ అఫిషియో సభ్యుడు, టీడీపీ తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డా. డాలర్స్ దివాకర్ రెడ్డి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ ప్రాంగణంలో ప్రతి దశను నిశితంగా పరిశీలించిన ఆయన, ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్ట్ ఏజెన్సీ ప్రతినిధులకు పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక, మన్నికైన నిర్మాణ సామగ్రిని మాత్రమే వినియోగించాలని అధికారులకు సూచించారు. ఈ టవర్స్ భవిష్యత్ తరాలకు తుడా పనితీరుకు సజీవ సాక్ష్యంగా నిలవాలని ఆయన పేర్కొన్నారు. నగర ప్రజలు, వ్యాపార వర్గాలకు వీలైనంత త్వరగా తుడా టవర్స్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని, ఇందుకోసం నిర్మాణ పనుల వేగాన్ని మరింత పెంచాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా ప్రాజెక్టును 100 శాతం పూర్తి చేసి, ఎలాంటి జాప్యానికి తావులేకుండా పనులు పూర్తి చేయాలని సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విశాలమైన, పకడ్బందీ పార్కింగ్ సదుపాయాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. భవనం నలుమూలలా గాలి, వెలుతురు సమృద్ధిగా వచ్చేలా నిర్మాణ ప్రణాళికను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. అత్యాధునిక అగ్నిమాపక భద్రతా వ్యవస్థతో పాటు అత్యవసర నిష్క్రమణ మార్గాలను అన్ని భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించాలని సూచించారు. నిర్మాణంలో పాల్గొంటున్న ప్రతి కార్మికుడి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్మాణ ప్రదేశంలో అన్ని రకాల రక్షణ చర్యలను తప్పనిసరిగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో తుడా సెక్రటరీ డా. ఎన్.వి. శ్రీకాంత్ బాబు, ఎస్ఈ రవీంద్రయ్య, భూసేకరణ అధికారి సుజన, తుడా ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళదాం

**- పెంచిన ధరలకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం**
**- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పుట్టా హరినాథరెడ్డి**




**తిరుపతి, మే 30, (ఆంధ్రనాడు):** అమెరికా సామ్రాజ్యవాదానికి, ట్రంప్ విధానాలకు లొంగిపోయి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు విధానాల వల్లే దేశంలో ఆర్థిక సంక్షోభం, విపరీతమైన ధరల పెరుగుదల దాపురించాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పుట్టా హరినాథరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, పెంచిన ధరలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. తిరుపతి నగరం బైరాగపట్టెడలోని గంధమనేని శివయ్య, కృష్ణారెడ్డి భవన్‌లో శనివారం నదియా అధ్యక్షతన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన పుట్టా హరినాథరెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై నిప్పులు చెరిగారు. ఆయన మాట్లాడిన ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే...

**అంతర్జాతీయ ఆంక్షల నెపంతో మోసం**

అంతర్జాతీయంగా అమెరికా–ఇరాన్ యుద్ధం అని, హార్ముజ్ జలసంధి మూసేశారని, క్రూడాయిల్ రావడం లేదని ప్రధాని మోదీ ఉచిత సలహాలు ఇస్తున్నారు. కానీ దేశంలో మూడు నెలలకు సరిపడా క్రూడాయిల్ నిల్వలు ఉన్నాయని చెబుతూనే.. డీజిల్ దొరకకపోవడం, గ్యాస్ కోసం ప్రజలు 20 నుంచి 30 రోజులు నిరీక్షించాల్సి రావడం ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమే. ఇరాన్, రష్యా దేశాలు మన రూపాయి మారకంలోనే, డాలర్‌తో సంబంధం లేకుండా క్రూడాయిల్ సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నా.. అమెరికా ఆంక్షలకు లొంగిపోయి మోదీ ప్రభుత్వం అక్కడ ఆయిల్ కొనడం లేదు. ఈ దౌర్భాగ్య పరిస్థితిని కప్పిపుచ్చుకోవడానికి, ధరల పెరుగుదల అనివార్యమని ప్రజలను నమ్మించడానికి సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారు."

**సామాన్యుడిపై భారాల మోత..**

గడిచిన వారం, పది రోజుల్లోనే నాలుగు ఐదు దఫాలుగా లీటర్ పెట్రోల్, డీజిల్ ధరలపై దాదాపు పది రూపాయల దాకా పెంచడం వల్ల ఉత్పత్తి రంగం కుప్పకూలిందని హరినాథరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కమర్షియల్ గ్యాస్ ధరలు పెరగడంతో స్టార్ హోటళ్లు తమ రేట్లను 20 శాతం పెంచుకున్నాయని, ధనికులు దీన్ని భరించగలిగినా.. ఆటో కార్మికులు, చిరువ్యాపారులు, వీధి వ్యాపారస్థులు, సామాన్య వినియోగదారులు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు.

**పాలకులవి శ్రీరంగ నీతులు...**

ప్రజలను ఖర్చులు తగ్గించుకోవాలని, ప్రయాణాలు మానుకోవాలని ఉచిత సలహాలు ఇస్తున్న పాలకులు.. తాము మాత్రం విలాసవంతమైన జీవితాలు గడుపుతున్నారని విమర్శించారు. ఒకరోజు సైకిల్ తొక్కి పొదుపు చర్యలంటూ షో చేసిన నాయకులు, మరుసటి రోజు నుంచే యధాప్రకారంగా కాన్వాయ్‌లతో తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ ప్రత్యేక విమానాల్లో తిరుగుతూ.. మహానాడును హైబ్రిడ్ విధానంలో జరిపాం కాబట్టి పొదుపు చేసామనడం హాస్యాస్పదమన్నారు. విదేశాలకు పోవద్దని సామాన్యుడికి చెప్పే మోదీ... మరుసటి రోజే విమానం వేసుకుని తిరుగుతారని, వీరు చెప్పేవి శ్రీరంగ నీతులు.. చేసేవి దౌర్భాగ్యపు పనులని మండిపడ్డారు.జూన్ 1 నుంచి 7 వరకు ప్రచారం.. 9న 'రాస్తారోకో', కేంద్రంలోని బీజేపీ వైఫల్యాలను, ఈ దుస్థితిని ప్రజలకు వివరించడానికి రాష్ట్రంలోని వామపక్షాలన్నీ కలిసి కార్యాచరణ రూపొందించినట్లు హరినాథరెడ్డి ప్రకటించారు. జూన్ 1 నుండి 7 వరకు రాష్ట్ర వ్యాప్తంగా కరపత్రాలు, సభలు, సమావేశాల ద్వారా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిద్దామని... 9వ తేదీ కేంద్ర వైఫల్యాలపై రాష్ట్రవ్యాప్తంగా 'రాస్తారోకో'లు నిర్వహిద్దామన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా యువత వీధుల్లోకి వస్తోందని, మోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లతో పాటు పంజాబ్‌లోనూ పెద్ద ఎత్తున ఆందోళనలు జరుగుతున్నాయని, మెయిన్ స్ట్రీమ్ మీడియా వీటిని కప్పిపుచ్చినా సోషల్ మీడియా ద్వారా నిజాలు బయటకు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ ప్రజా వ్యతిరేక విధానాలపై జరిగే పోరాటాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, తొమ్మిదో తేదీన జరిగే రాస్తారోకోను విజయవంతం చేయాలని పుట్టా హరినాథరెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.




# గోవిందరాజస్వామి రథోత్సవం సందర్భంగా అన్నప్రసాదాల పంపిణీ

**తిరుపతి, ఆంధ్రనాడు, మే 30:** తిరుపతిలో శ్రీ గోవిందరాజస్వామివారి రథోత్సవం అత్యంత వైభవంగా, భక్తి శ్రద్ధల నడుమ ఘనంగా జరిగింది. ఈ పవిత్ర రథోత్సవంలో స్థానిక రాయలసీమ రంగస్థలం కళాకారులు భక్తి పూర్వకంగా పాల్గొని స్వామివారికి తమ సేవలను సమర్పించారు. రథోత్సవం అనంతరం తూర్పు మాడవీధిలో రాయలసీమ రంగస్థలం కళాకారులు భక్తులకు అన్నప్రసాదాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు ఈ అన్నదాన సేవలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా రాయలసీమ రంగస్థలం చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ, శ్రీ గోవిందరాజస్వామివారి రథోత్సవం రోజున భక్తులకు అన్నదానం చేయడం రాయలసీమ రంగస్థలం కళాకారుల చిరకాల సంప్రదాయమని తెలిపారు. భగవంతునికి చేసే సేవల్లో అన్నదానం మహాదానమని, ఈ సేవ ద్వారా భక్తులకు ఆధ్యాత్మిక తృప్తి కలుగుతుందని పేర్కొన్నారు. శ్రీ గోవిందరాజ స్వామివారి దివ్య ఆశీస్సులతో సకాలంలో వర్షాలు కురిసి రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలం చైర్మన్ గుండాల గోపీనాథ్, సభ్యులు తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, భాస్కర్, వీరభద్రరావు,



విజయ్, రెడ్డి బాబు, పురోహితుడు సురేష్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి జీ.ఎం.హెచ్‌లో లాపరోస్కోపీ వర్క్‌షాప్ ఘనారంభం

**తిరుపతి, మే 30, (ఆంధ్రనాడు):** పేద మహిళలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించే లక్ష్యంతో తిరుపతి ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, జీ.ఎం.హెచ్‌లో "అడ్వాన్స్‌డ్ లాపరోస్కోపీ ఇన్ అబ్స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ"పై రెండు రోజుల వర్క్‌షాప్ శుక్రవారం ప్రారంభమైంది. తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. "గాయం చిన్నది, ఉపశమనం పెద్దది" అనే కీ–హోల్ సర్జరీ విధానంతో తల్లుల కోలుకోవడం వేగంగా ఉంటుందని ఆయన చెప్పారు. జీ.ఎం.హెచ్‌లో లాపరోస్కోపీ సేవలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామని ప్రకటించారు.




**ఉచిత లాపరోస్కోపీ సేవలు**

ఈ వేదికపై జీ.ఎం.హెచ్ సూపరింటెండెంట్ డా. ప్రమీలదేవి మాట్లాడుతూ, అర్హులైన పేద మహిళలకు ఉచిత లాపరోస్కోపీ సేవలు అందించనున్నట్లు తెలిపారు. పెద్ద కోతలు లేకపోవడంతో 48 గంటల్లో డిశ్చార్జ్ చేసే అవకా శం ఉందని, పి.పి.హెచ్ వంటి అత్యవసర కేసుల్లో గర్భ సంచిని కాపాడుకోవచ్చని వివరించారు. ట్యూబ్ బ్లాక్, పి. సి.ఓ.డి, ఎండోమెట్రియోసిస్‌కు లాపరోస్కోపీ ద్వారా ఖచ్చితమైన చికిత్స అందుతుందన్నారు.



**లైవ్ సర్జరీ డెమో**

ప్రముఖ లాపరోస్కోపీ సర్జన్ డా. జహుల్ పటేల్ లైవ్ సర్జరీ డెమో ఇచ్చారు. పి.ఎల్.హెచ్, ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ, ఎండోమెట్రియోసిస్ వంటి ఆపరేషన్లను లాపరోస్కోపీ ద్వారా సురక్షితంగా చేయవచ్చని వివరించారు. ఎస్.వి మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డా. రవి ప్రభు మాట్లాడుతూ, "తల్లిని బ్రతికిస్తే కుటుంబాన్ని బ్రతికించినట్లే" అనే నినాదంతో జీ.ఎం.హెచ్ లాపరోస్కోపీ యూనిట్ రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తుందని ఆకాంక్షించారు. ఈ వర్క్‌షాప్‌లో 60 మంది గైనకాలజిస్టులు, పి.జి విద్యార్థులు పాల్గొన్నారు. డా. అంకుల్ షా, డా. సందీప్ కాక్వాడ్, డా. చింతన్ అరవింద్ పటేల్, డా. జీవన్ బాబు, డా. రాధ, డా. గాయత్రి శ్రీశ్రీ, డా. నిర్మలదేవి, డా. మాధవి, డా. రంగనాథ్, డా. రవికిరణ్, డా. జ్యోత్స్న, డా. ఉమ, డా. బాలాజీ, డా. జయశ్రీ తదితరులు హాజరయ్యారు. సివిల్ సర్జన్ ఆర్.ఎం.ఓ డా. రామనారాయణ రెడ్డి, శ్రీ మునిస్వామి, శ్రీ రాజా రెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ శ్రీమతి కళావతి, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## జూన్ 3న దివ్యాంగుల జాబ్ మేళా

**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 30:** ప్రత్యేక ప్రతిభావంతులైన నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జూన్ 3న చిత్తూరులో ప్రత్యేక జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు వినోద్ తెలిపారు. డ్రీమ్ ఫౌండేషన్, చెషైర్ డిసబిలిటీ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 గంటలకు చిత్తూరు కొంగారెడ్డిపల్లిలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నారు. చెవిటి, మూగ, శారీరక వైకల్యం కలిగిన 19 నుంచి 32 సంవత్సరాల మధ్య వయస్సు గల ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొనవచ్చని తెలిపారు. టీవీఎస్, అమెజాన్, రిటైల్, హాస్పిటాలిటీ, బీపీవో తదితర రంగాలకు చెందిన సంస్థలు తిరుపతి, బెంగళూరు, చెన్నై నగరాల్లోని ఉద్యోగాల కోసం అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్ కార్డు, పాన్ కార్డు, విద్యార్హతల ధ్రువపత్రాలు, సదరం సర్టిఫికేట్‌తో హాజరు కావాలని సూచించారు. ముందస్తు నమోదు, ఇతర వివరాల కోసం 99855 80557 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

## డీఈఓపై చర్యలు తీసుకోవాలి

**- అధికార పార్టీ కార్యక్రమాలకు ఉపాధ్యాయుల సమీకరణపై సిపిఎం ఆగ్రహం**

**- విద్యాశాఖను రాజకీయ ప్రయోజనాలకు వినియోగించడం సరికాదన్న వందవాసి నాగరాజు**

**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 30 :** జిల్లాలో విద్యాభివృద్ధి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాల్సిన జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) అధికార పార్టీ రాజకీయ కార్యక్రమాలకు ఉపాధ్యాయులను సమీకరించే పనిలో నిమగ్నమవడం తీవ్రంగా ఖండనీయమని సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పేర్కొన్నారు. ఇటీవల డీఎస్సీ నియామకాలలో జరిగిన అవకతవకలు, అవినీతి ఆరోపణల నేపథ్యంలో ప్రజల దృష్టిని మళ్లించేందుకు అధికార పార్టీ కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులతో రాజకీయ సభ నిర్వహించిందని, ఆ సభకు ఉపాధ్యాయులను డీఈఓ కార్యాలయం ద్వారా ఫోన్లు చేసి పిలవడం ప్రభుత్వ ఉద్యోగుల రాజకీయ తటస్థతను దెబ్బతీసే చర్య అని విమర్శించారు. విద్యా కార్యక్రమమని భావించి హాజరైన ఉపాధ్యాయులను రాజకీయ సభకు తరలించడం, వారిపై ఒత్తిడి తేవడం, సమావేశ స్థలాలను మార్చి ఇబ్బందులకు గురిచేయడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని పార్టీ కార్యక్రమాలకు వినియోగించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. డీఈఓ చట్టవిరుద్ధంగా వ్యవహరించిన అంశంపై జిల్లా కలెక్టర్ వెంటనే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ తరపున డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించే ధోరణిని వెంటనే నిలిపివేయాలని, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండి తమ వృత్తి గౌరవాన్ని కాపాడుకోవాలని, రాజకీయ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సిపిఎం తరపున పిలుపునిచ్చారు.

## తిరుపతి జిల్లాలో ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు - హాజరు నివేదిక

**తిరుపతి, మే 30, (ఆంధ్రనాడు) :** బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐపేస్ మే 2026 థియరీ పరీక్షలకు తిరుపతి జిల్లాలో శనివారం సాయంత్రం సెషన్‌కు మంచి స్పందన లభించింది. ప్రాంతీయ ఇన్‌స్పెక్షన్ అధికారి కార్యాలయం విడుదల చేసిన హాజరు నివేదిక ప్రకారం, జిల్లాలోని 52 పరీక్షా కేంద్రాలకు 4,147 మంది విద్యార్థులకు హాల్ టికెట్లు కేటాయించారు. వీరిలో 3,564 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 583 మంది గైర్హాజరయ్యారు. హాజరు శాతం సుమారు 86%గా నమోదైంది.

## బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి సుగుణవతి బిజెపిలో చేరిక



**తిరుపతి, ఆంధ్రనాడు, మే 30:** బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ఇన్చార్జిగా పనిచేస్తున్న సుగుణవతి యాదవ్ బిజెపి తిరుపతి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్ సమక్షంలో బిజెపి కండువా కప్పుకున్నారు. బీసీలకు, మహిళలకు సముచిత స్థానం బిజెపిలో లభిస్తుందని, నరేంద్ర మోడీ సమర్థవంత మైన నాయకత్వం దేశాన్ని ముందుకు నడిపిస్తున్నదని, వికసిత భారత్ లక్ష్యంగా ప్రధాని మోడీకి బాసటగా ప్రజలందరూ నిలవాలని, ముఖ్యంగా బీసీలను పార్టీ వైపు తీసుకురావాలని సామంచి శ్రీనివాస్ అన్నారు. బిజెపి అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషి చేస్తానని సుగుణవతి తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ కాంట్రాక్టర్ ప్రసాద్ రెడ్డి తదితరులు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్, ఉపాధ్యక్షురాలు ప్రశాంతి రాజు, వేదవతి, బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జీడి నెల్లూరు జైన్ మామిడి గుజ్జు పరిశ్రమలో మొదలైన తోతాపురి కొనుగోలు



**గంగాధరనెల్లూరు, మే, 30, ఆంధ్రనాడు:** మామిడి కొనుగోలులో అవకతవకలు లేకుండా రైతులకు శాశ్వత ఐడి కార్డుల పంపిణీ గంగాధర నెల్లూరు మండల కేంద్రంలోని జైన్ ఫామ్ ఫ్రెష్ మామిడి గుజ్జు పరిశ్రమలో మామిడికాయల కొనుగోలు మొదలయ్యాయి. గత ఏడాది కంటే నెల రోజులు ముందే ప్రారంభమైన మామిడికాయల కొనుగోలు, పరిశ్రమ యాజమాన్యం టన్ను 7వేల రూపాయలు నిర్ణయించడంతో మొదటిరోజు 100 ట్రాక్టర్లు ఫ్యాక్టరీ ఎదుట క్యూ కట్టింది,జైన్ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ వేసవకాబట్టి అన్ని సౌకర్యాలు కల్పించారు.

## వై. బాలాజీ కిరణ్ మొదటి దక్షిణ కోస్తా రైల్వే సీపీఆర్‌వోగా బాధ్యతలు



**తిరుపతి, ఆంధ్రనాడు, మే 30:** 2013 బ్యాచ్‌కు చెందిన భారతీయ రైల్వే ట్రాఫిక్ సర్వీస్ అధికారి వై. బాలాజీ కిరణ్ దక్షిణ కోస్తా రైల్వే ప్రధాన ప్రజా సంబంధాల అధికారిగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. దక్షిణ కోస్తా రైల్వేలో డిప్యూటీ జనరల్ మేనేజర్-కమ్-సెక్రటరీ టు జనరల్ మేనేజర్‌గా శ్రీ బాలాజీ కిరణ్ విధులు నిర్వహిస్తున్నారు. భారతీయ రైల్వేల్లో ట్రాఫిక్, కమర్షియల్ విభాగాల్లో విశేష అనుభవం కలిగిన ఆయన గుంతకల్ డివిజన్‌లో సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్‌గా, సికింద్రాబాద్ మరియు హైదరాబాద్ డివిజన్లలో సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. వెంకటగిరి కి చెందిన బాలాజీ కిరణ్, శ్రీ కాళహస్తీశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ లో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో బీటెక్ పట్టా పొందారు. అనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎంబీఏ పూర్తి చేయడంతో పాటు, పొలిటికల్ సైన్స్ మరియు ఇండస్ట్రియల్ రిలేషన్స్‌లో మాస్టర్స్ డిగ్రీలను కూడా సాధించారు. ఆంధ్రప్రదేశ్‌లోని నాయుడుపేటకు చెందిన ఆయన సామాజిక సేవా కార్యక్రమాలు, యువత అభివృద్ధి పట్ల ప్రత్యేక ఆసక్తి కలిగిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. నాయుడుపేటలో "ఆశయ" అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి, పలు సామాజిక సంక్షేమ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. సివిల్ సర్వీసుల్లో చేరకముందు సింగపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేశారు. అలాగే ఢిల్లీలోని శ్రీ చైతన్య ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్‌గా సేవలందిస్తూ, అనేక మంది సివిల్ సర్వీసెస్ అభ్యర్థులకు మార్గదర్శకత్వం వహించారు. తన విస్తృత పరిపాలనా అనుభవం, వృత్తిపరమైన నైపుణ్యం, సమర్థమైన కమ్యూనికేషన్ సామర్థ్యాలతో వై. బాలాజీ కిరణ్ దక్షిణ కోస్తా రైల్వే ప్రజా సంబంధాలు, మీడియా అనుసంధాన కార్యక్రమాలను మరింత బలోపేతం చేస్తారని రైల్వే వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

## డీఎస్సీ అభ్యర్థులపై, నిరుద్యోగులపై వైసిపి గొడ్డలి పోటు : నిరుద్యోగుల ఆందోళన

- ఉద్యోగ నియామకాల్లో తప్పుడు బ్రతుకు వైసీపీది: ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి.
- 5 - 10 సంవత్సరాల కాలం కష్టం ఈ ఉపాధ్యాయ ఉద్యోగం: నూతన ఉపాధ్యాయులు.
- కంటతడి పెట్టిన నూతన ఉపాధ్యాయులు.
- భవిష్యత్తు డీఎస్సీ లను అడ్డుకుంటారేమో: నిరుద్యోగుల ఆందోళన
- జాబ్ క్యాలెండర్ ను అడ్డుకోవడానికే వైసిపి బురద చల్లే ప్రయత్నం: ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్.
- క్రీడల కోటాలో ఉద్యోగాలు ఎలా భర్తీ చేస్తారో తెలియని వైసీపీ: శాప్ చైర్మన్
- నిరుద్యోగుల వద్ద డబ్బు ఆశించడం రక్తపుకూడు తో బీసమానం: రవి నాయుడు.



**తిరుపతి, ఆంధ్రనాడు, మే 30:** కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో 16 వేల పైచిలుకు ఉపాధ్యాయ ఉద్యోగాల మెగా డీఎస్సీ విజయవంతం అవడంతో భరించలేక ఈ డీఎస్సీ పై తీవ్ర ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో, భవిష్యత్తు డీఎస్సీ జరగకూడదు అనే దురుద్దేశంతో వైసిపి ప్రభుత్వం అనేక తీవ్ర ఆరోపణలు చేస్తున్నది. ఈ నేపథ్యంలో తిరుపతి నగరంలో బాలాజీ కాలనీలోని ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో జరిగిన నిరుద్యోగ యువత సమావేశం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి నిరుద్యోగ యువత నాయకులుతో పాటు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, రాంభూపాల్ రెడ్డి, శాప్ చైర్మన్ రవి నాయుడు, నూతన



ఉపాధ్యాయ ఉద్యోగులు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు. అనంతపురం కడప కర్నూలు జిల్లాల పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ నియామకాల్లో ఎలా తప్పుదారులు పట్టాలో వైసిపి, వైసిపి వారి బందోవర్గానికి బాగా ఎరుకని ఆయన ఆరోపించారు. గత ఐదు సంవత్సరాల కాలంలో లేదా గతంలో వైయస్సార్ బంధువులు ఎలాంటి పనులు చేశారో, చేస్తారో ఆంధ్ర రాష్ట్ర ప్రజానీకానికి బాగా తెలుసని ఆయన అన్నారు. రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ వైసిపి వారిలా రక్తపు కూడు తినాలనే ఆశయం నారా చంద్రబాబునాయుడుకు గాని, నారా లోకేష్ గారికి కానీ లేదని ఆయన అన్నారు. గతంలో 11 డీఎస్సీలలో నిర్వహించిన ఘనత నారా చంద్రబాబు నాయుడు దని ఆయన గుర్తు చేశారు. ఆ సమయంలో ఎలాంటి అవినీతి ఆరోపణంలో లేవని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం జరిగిన మెగా డిఎస్సి లో ఏ అభ్యర్థి కూడా తప్పు జరిగిందని వైసిపి దగ్గరకు వచ్చాడా? అని ఆయన ప్రశ్నించాడు. 2006 డీఎస్సీలో జగన్ మేనమామ, బాబాయ్ లు పరీక్ష నిర్వహించిన తర్వాత హైదరాబాద్ వెళుతున్న ఓఎంఆర్ షీట్లను అడ్డగించి, ఆ సమయంలో కోట్లాది రూపాయల వసూలు చేసిన అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లను రుద్ది, కష్టపడిన వారికి కాకుండా డబ్బు కట్టిన వారికి ఉద్యోగాలు వచ్చేలాగా చేసిన ఘనత వైసిపి బంధు వర్గానిది అని ఆయన అన్నారు. దీనిపై అప్పుడే ఎఫ్ఐఆర్ నమోదయిందని ఆయన గుర్తు చేశాడు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యోగ ఖాళీలే లేవు అని ఐదు సంవత్సరాల పరిపాలనాలో ఒక డీఎస్సీ ని కూడా నిర్వహించలేని వైసీపీ ప్రభుత్వం ఈరోజు కష్టపడి ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల పైన తప్పుడు ఆరోపణలు చేయడం చాలా దుర్మార్గము అన్నాడు. చిత్తూరు నెల్లూరు ఒంగోలు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల కోసం ఎలక్షన్లప్పుడు మెగా డీఎస్సీ హామీ ఇచ్చిందనీ, దానిని గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి యువ నాయకుడు నారా లోకేష్, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గారు, ఆంధ్రప్రదేశ్ బిజెపి అధినాయకులు సంయుక్తంగా నూతన ప్రభుత్వ మొట్ట మొదటి సంతకంగా 16 వేల ఉపాధ్యాయ ఖాళీలతో మెగా డీఎస్సీ ని విడుదల చేసి, ని



యామకాలను విజయవంతం చేసిందని ఆయన అన్నారు. దీనిని ఓర్వలేక తప్పుడు ఆరోపణలతో వైసిపి పార్టీ నిరుద్యోగులపై లేని సవతి ప్రేమను ప్రకటిస్తున్నదని ఆయన అన్నారు. తెలుగు దేశంలో పారదర్శకతకు పెట్టింది పేరని, ఇది తెలుగు జాతికి చాలా బాగా తెలుసని ఆయన అన్నారు. శాప్ చైర్మన్ రవి నాయుడు మాట్లాడుతూ మెగా డీఎస్సీ విజయవంతం అవడంతో ఏం చేయాలో పాలుపోక వైసిపి తప్పుడు ఆరోపణలను చేస్తుందని ఉన్నాడు. నిరుద్యోగుల వద్ద డబ్బు ఆశించడం అంటే రక్తపు కూడు తినడంతో సమానమని ఆయన అన్నారు. క్రీడా కోటాలో ఉద్యోగాలు ఎలా భర్తీ చేస్తారో తెలియని విధానం వైసిపి పార్టీదని ఆయన అన్నారు. క్రీడా కోటాలో ఉద్యోగ నియామకాల కొరకు ఆశించి వచ్చే అభ్యర్థుల సర్టిఫికెట్లను శాప్ మంజూరు చేయదనీ, దానిని క్రీడా సంఘాలే మంజూరు చేస్తాయనీ, అదేవిధంగా ఆ క్రీడా సంఘాలు మంజూరు చేయాలంటే అభ్యర్థి కొన్ని సంవత్సరాలుగా ఆ క్రీడలో పట్టు సాధించి, విజయం సాధించి ఉండాలని, తద్వారానే లభించే సర్టిఫికెట్ను ఉపయోగించి ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తే, దానిని పరిశీలనకు అధికారులు, ఆయా సంఘాల తో కూడిన కమిటీకి సిఫార్సు చేస్తామన్నారు. ఆ విధంగా వారి ద్వారా వచ్చే మెరిట్ లిస్టు ని ఆన్లైన్లో బహిర్గతం చేసామన్నారు. అప్పుడు కనిపించని తప్పులు ఒక సంవత్సరం తర్వాత కనిపిస్తున్నాయా అనే ఎద్దేవా చేశాడు. ఈ సమావేశంలో పాల్గొన్న నూతన ఉపాధ్యాయ అభ్యర్థులు మాట్లాడుతూ మేము అనేక సంవత్సరాలు, అనేక వ్యయ ప్రయాసలకు ఓర్చి ఉదయం ఐదు గంటలు మొదలు రాత్రి 12 వరకు గంటల వరకు చదువుతూ, ఆకలితో అలమటిస్తుంటే దాతల సహకారంతో మేము కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించామనీ, దీనిని అవహేళన చేస్తూ వైసిపి ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలు మా కుటుంబాలలో తీవ్ర అలజడిని, ఆందోళన రేకెత్తిస్తున్నాయని కళ్ళ నీళ్లు పర్యాంతం అక్రోషించారు. మీ రాజకీయాల కోసం మమ్మల్ని బల్లి పశువులు చేయకండి అనీ నూతన మహిళ ఉపాధ్యాయరాలు సమావేశంలో మాట్లాడుతూ కన్నీళ్లు కార్చింది. ఈ కార్యక్రమంలో పెద్ద స్థాయిలో నూతన ఉపాధ్యాయులు, నిరుద్యోగ యువత, విద్యార్థి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పీలేరులో డ్రగ్ డిటెక్షన్ కిట్లతో ముమ్మర తనిఖీలు

**పీలేరు – ఆంధ్రనాడు, మే 30:** పీలేరు ప్రాంతంలో మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి, ఐపీఎస్ ఆదేశాల మేరకు గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగదారులను గుర్తించేందుకు అధునాతన డ్రగ్ డిటెక్షన్ కిట్లతో ప్రత్యేక తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాయచోటి సబ్ డివిజన్ డీఎస్పీ ఎం.ఆర్. కృష్ణమోహన్ పర్యవే క్షణలో, పీలేరు సీఐ పి. యుగంధర్ ఆధ్వర్యంలో గతం లో గంజా యి సేవిస్తూ పట్టుబడిన నిందితులు, అనుమానితులపై ప్రత్యేక నిఘా ఉంచి శనివారం డ్రగ్ టెస్టులు నిర్వహిం చారు. మొత్తం 8 మందికి యూరిన్ శాంపిల్ పరీక్షలు చే యగా, అందరికీ నెగిటివ్ ఫలితాలు వచ్చినట్లు అధికారు లు తెలిపారు. యువత భవిష్యత్తును దెబ్బతీసే గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, నిల్వ, అక్రమ రవాణా వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలపై పీలేరు పోలీస్ శాఖ నిరంతరం కట్టుదిట్టమైన చ ర్యలు తీసుకుంటోందని అధి కారులు పేర్కొన్నారు. నిందితు లపై నిరంతర నిఘా కొనసా గుతోందని స్పష్టం చేశారు. మత్తు రహిత సమాజ నిర్మా ణం కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమని వారు తెలిపారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుని ఉన్నత లక్ష్యా లను సాధించాలని సూచించారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా మాదకద్రవ్యాల వినియోగం లేదా అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు గమనిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 112, ఈగల్ సెల్ టోల్ ఫ్రీ నంబర్ 1972కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో ప్రజలందరూ పోలీస్ శాఖకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.





# డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించండి: ఎమ్మెల్యే ఆరణి



**తిరుపతి, ఆంధ్రనాడు, మే 30 :** 13వ డివిజన్ పరిధిలోని ఎస్ జీ ఎస్ కాలేజీ రోడ్డు యూడీఎస్ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎస్ ఈ శ్యాంసుందర్ ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆదేశించారు. మురికి కాలువ నుంచి నీరు పొంగి వస్తుండ టంతో తాము ఇబ్బంది పడుతున్నట్లు స్థానికులు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దృష్టికి తీసుకురాగా శనివారం ఉదయం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ తో కి కలిసి మురుగునీటి కాలువను పరిశీలించారు. మురుగు నీరు తరుచూ తమ ఇళ్లల్లోకి వస్తున్నదని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సమస్య పరిష్కారానికి రోడ్డు మధ్యలో మ్యాన్ హోల్ వేసి ప్రధాన మురికి కాలువ కు అనుసంధానిస్తే సరిపోతుందని ఎస్ ఈ శ్యాంసుందర్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే మ్యాన్ హోల్ నిర్మించి సమస్య పరిష్కరించాలని ఎస్ ఈని  ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈ తులసి కుమార్, డిఈ రాజు, జనసేన నగర అధ్యక్షులు రాజా రెడ్డి, మాజీ కార్పొరేటర్ ఎస్ కే బాబు, అంకాలమ్మ ఆలయ పాలకమండలి చైర్మన్ కొండా రాజమోహన్, ఆనంద్, మణి వర్మ, రమేష్ నాయుడు, పవన్, ఆముదాల వెంకటేష్, చింతంశెట్టి మధు, రామరావు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాజేంద్ర ప్రసాద్‌కు ఘన వీడ్కోలు




**చిత్తూరు, మే 30, ఆంధ్రనాడు :** జిల్లా విద్యాశాఖ అధికారిగా (డీఈవో) విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన కె. రాజేంద్ర ప్రసాద్‌కు శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జడ్పీ సమావేశ మందిరంలో  నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు ఆయన సేవలను కొనియాడారు. వక్తలు మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా తన సేవా ప్రస్థానాన్ని ప్రారంభించిన రాజేంద్ర ప్రసాద్, వేలాది మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. 37 సంవత్సరాలపాటు విద్యాశాఖలో వివిధ హోదాల్లో సమర్థవంతంగా పనిచేస్తూ శాఖ అభివృద్ధికి విశేష కృషి చేశారని తెలిపారు. విద్యారంగ అభ్యున్నతికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్‌ను ఘనంగా సన్మానించి, ఆయన శేష జీవితం ఆరోగ్యంగా, ఆనందంగా గడవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డీఆర్వో మోహన్ కుమార్, ఎస్ఎస్‌సీపీఓ మదిపట్ల వెంకటరమణ, ఏడీ సుకుమార్, హరినాథ్ రెడ్డి, డీవైఈఓ ఇంద్రాణి, ఓపెన్ స్కూల్ జిల్లా అధికారి జయప్రకాశ్ నాయుడు, వివిధ మండలాల ఎంఈఓలు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా జిల్లా టిడిపి నాయకులు కాజూరు బాలాజీ జన్మదిన వేడుకలు



**చిత్తూరు, మే 30, ఆంధ్రనాడు:** చిత్తూరు జిల్లా టిడిపి కనాయకులు కాజూరు బాలాజీ జన్మదిన వేడుకలను  తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలో  కాజూరు బాలాజీ స్వగృహం , గాంధీ విగ్రహ కూడలి, నగరంలోని పలు ప్రాంతాల్లో జన్మదిన వేడుకలను తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పుట్టినరోజు కేకులు కట్ చేయడం , పేదలకు అన్నదానం చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య  అతిథిగా చిత్తూరు  ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పాల్గొని  కాజూరు బాలాజీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా సాయంత్రం స్థానిక గాంధీ సర్కిల్ వద్ద 200 మంది పేద విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, చూడ చైర్మన్ కఠారి హేమలత, తెలుగుదేశం పార్టీ నాయకులు, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు కాజూరు రాజేష్ కుమార్, కాజూరు బాలాజీ (కె.బీ), టిడిపి నాయకులు చందు, యూత్ టిడిపి శ్రేణులు తదితరులు, జనసేన నాయకులు పూల చందు, జిల్లా ప్రధాన కార్యదర్శి, యశ్వంత్ పాల్గొన్నారు.

# జన విశ్వాస్ - సురక్షిత త్రిచక్ర వాహన ప్రయాణాలు" కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన  ఎస్పీ  తుషార్ డూడి



**చిత్తూరు, మే 30, ఆంధ్రనాడు:** సురక్షిత రవాణా వ్యవస్థ నిర్మాణంలో ఆటో డ్రైవర్లు కూడా భాగస్వాములు కావాలి. ప్రజల పట్ల బాధ్యతతో వ్యవహరించడం వారి సామాజిక కర్తవ్యం ఎస్పీ తుషార్ డూడి అన్నారు. ప్రజల భద్రత, మహిళల రక్షణ, నేరాల నివారణ ప్రజలకు సురక్షితమైన వ్యవస్థను అందించేందుకు చిత్తూరు జిల్లా పోలీసులు నిరంతరం వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. ప్రజలతో మరింత సన్నిహిత సంబంధాలను పెంపొందిస్తూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రజల్లో భద్రతాభావం పోలీసు శాఖపై విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే దిశగా చిత్తూరు జిల్లా పోలీసు శాఖ మరో ముందడుగు వేసింది. ఈ క్రమంలో చిత్తూరు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జన విశ్వాస్ – సురక్షిత త్రిచక్ర వాహన ప్రయాణాలు అనే వినూత్న కార్యక్రమాన్ని పట్టణంలో జిల్లా ఎస్పీ తుషార్ డూడి, నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఎఎస్పీ డాక్టర్ తరుణ్ పహ్వా, సంయుక్తంగా ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఆటోరిక్షాలకు ప్రత్యేక పోలీసు గుర్తింపు సంఖ్య , ప్రత్యేక క్యూఆర్  కోడ్ కలిగిన స్టిక్కర్లను ఆటోలకు అతికించి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా సంబంధిత ఆటో, డ్రైవర్, యజమాని, వాహనానికి సంబంధించిన అధికారిక వివరాలు ఇతర అవసరమైన సమాచారం అధికారులకు తక్షణమే అందుబాటులో ఉండే విధంగా వ్యవస్థను రూపొందించారు. ఈ చర్య ద్వారా ప్రయాణికుల భద్రత పెరగడంతో పాటు, నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ  ప్రజలకు మరింత నమ్మకమైన రవాణా సేవలు అందించడం సాధ్యమవుతుందని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై నాటికను ప్రదర్శించారు. డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు యువత బానిస కావడం వల్ల వారి భవిష్యత్తు ఎలా దెబ్బతింటుందో, కుటుంబాలు సమాజంపై వాటి ప్రభావం ఎలా ఉంటుందో విద్యార్థులు హృద్యంగా ప్రదర్శించారు. నాటికకు హాజరైన ప్రజలు, విద్యార్థులు అధికారులు ప్రశంసలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ  తుషార్ డూడి, మాట్లాడుతూ ప్రజల భద్రతే పోలీసు శాఖకు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని తెలిపారు. ప్రజలు ప్రతిరోజూ వినియోగించే ఆటోరిక్షా ప్రయాణాలను మరింత సురక్షితంగా, విశ్వసనీయంగా మార్చేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. జిల్లాలోని ప్రతి ఆటోను ప్రత్యేక గుర్తింపు వ్యవస్థ పరిధిలోకి తీసుకువచ్చి, అవసరమైనప్పుడు సంబంధిత వివరాలను తక్షణమే గుర్తించే విధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. మహిళలు, చిన్నారులు, విద్యార్థులు, వృద్ధులు భయాందోళనలు లేకుండా ఆటోలలో ప్రయాణించే వాతావరణాన్ని కల్పించేందుకు కార్యక్రమం దోహదపడుతుందని ఎస్పీ తెలిపారు. ఆటో డ్రైవర్లు ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, అధిక వేగంతో వాహనాలు నడపరాదని సూచించారు. ప్రయాణికుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో సమాజం మొత్తం భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందని ఎస్పీ పేర్కొన్నారు. డ్రగ్స్, గంజాయి ఇతర మత్తు పదార్థాలు యువత జీవితాలను నాశనం చేస్తున్నాయని, అలాంటి కార్యకలాపాలకు పాల్పడేవారి గురించి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మాదకద్రవ్యాలపై జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, ఈ విషయంలో ఎవరినీ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం చిత్తూరు జిల్లా పోలీసు శాఖ చేపడుతున్న ఈ కార్యక్రమం అభినందనీయమని అన్నారు. ఆటోరిక్షాలు సాధారణ ప్రజలు ఎక్కువగా వినియోగించే రవాణా సాధనమని, వాటి ద్వారా ప్రయాణించే ప్రతి ఒక్కరికీ భద్రత కల్పించడం చాలా అవసరమని పేర్కొన్నారు. ప్రత్యేక పోలీసు గుర్తింపు సంఖ్యలు, క్యూఆర్ కోడ్ వ్యవస్థ ద్వారా ఆటో సేవల్లో పారదర్శకత పెరగడంతో పాటు ప్రజల్లో నమ్మకం మరింత బలపడుతుందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సాంకేతికతను వినియోగిస్తూ పోలీసు శాఖ చేపడుతున్న కార్యక్రమాలు ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే  పేర్కొన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన డ్రగ్ అవగాహన నాటిక సమాజానికి మంచి సందేశాన్ని అందించిందని అభినందించారు. ఈ కార్యక్రమం ద్వారా ఆటో డ్రైవర్లు, ప్రయాణికులు పోలీసుల మధ్య మరింత విశ్వాసపూరిత సంబంధాలు ఏర్పడటంతో పాటు, సురక్షితమైన బాధ్యతాయుతమైన రవాణా వ్యవస్థకు బాటలు పడతాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆటో డ్రైవర్లకు యూనిఫాం వస్త్రాలను ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్, ఎస్పీ తుషార్ డూడి, పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నగరి అర్బన్ ఇన్స్పెక్టర్ మల్లికార్జున రావు, నగరి రూరల్ ఇన్స్పెక్టర్ భాస్కర్, ఎస్.బి. ఇన్స్పెక్టర్ మురళీమోహన్, నగరి సబ్ డివిజన్ పోలీసు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆటో యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# మీకు అండగా నేనున్నాను

**అటవీ ప్రాంత ప్రజలకు**
**- పి కే యం హుడా  చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు హామీ**



**రామకుప్పం, ఆంధ్రనాడు, మే 30:** రామకుప్పం మండలం అటవీపరిసర గ్రామాలు 89 పెద్దూరు ననీ యాల పీ ఎంకే తండా గ్రామాలలో ఏనుగులు పంటలపై దాడులు చేసి తీవ్రంగా నష్టం చేసింది సమాచారం తెలుసుకున్న పీకేఎం హుడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు ఆ గ్రామాలలో పంటలను పరిశీలించారు ఏనుగుల దాడుల వల్ల రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తామని విద్యుత్ కంచె లేని చోట్ల కంచె ఏర్పాటుకు అటవీశాఖ అధికారులతో ప్రతిపాదనలు తయారుచేసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కి పంపి మంజూరు చేయించి ఏనుగుల దాడులు లేకుండా చూసే బాధ్యత నాదేనని నేను ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటానని వారికి పి కే యం యూడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు వారికి హామీ ఇచ్చారు ఏనుగుల దాడుల వల్ల పంటలు నష్టపోయిన వారికి ఆస్తి నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు అటవీశాఖ అధికారులకు ఆయన సూచనలు చేశారు అటవీ ప్రాంత ప్రజలు ఒంటరిగా అడవికి వెళ్లవద్దని పరిసర ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని ఆయన వారికి తెలిపారు అడవి ప్రాంత ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఆయన వారికి హామీ ఇచ్చారు గతంలో కుప్పం శాసనసభ్యులుగా రెస్కో చైర్మన్గా ఉన్న దొరస్వామి నాయుడు అటవీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా చేసి వారికి ఆరాధ్య దైవమయ్యాడు అడవి ప్రాంత ప్రజలకు ఎల్లప్పుడూ ఆయన ఏ సమస్య వచ్చిన అందుబాటులో ఉండి న్యాయ సాయం కూడా చేసేవారు దానితో అడవి పరిసర ప్రాంతాల ప్రజలు వీరి కుటుంబం పై ఎక్కువ అభిమానం చూపిస్తారు ఆ క్రమంలోనే ఆయన తనయుడు డాక్టర్ సురేష్ బాబు పై ప్రజలు అభిమానం పెంచుకొని తమ కష్టాలు నెరవేర్చాలని ఆయనకు విన్నవించారు ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు వెంకటరమణ టిడిపి నాయకులు గజేంద్ర లోకేష్ జి ఎస్ బాబు వేణు గంగాధరం త్యాగరాజు సాము నాయక్ ఫారెస్ట్ రేంజర్ జయశంకర్ ఇంకా అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు



# రేపు తిరుపతి - రక్సౌల్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభోత్సవం



**తిరుపతి, ఆంధ్రనాడు, మే 30 :** దక్షిణ కోస్తా రైల్వే, గుంతకల్ డివిజన్ ఆధ్వర్యంలో రైలు నం. 17433/17434 తిరుపతి–రక్సౌల్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభోత్సవ కార్యక్రమం జూన్ 1, 2026 (సోమవారం) ఉదయం 8:15 గంటలకు తిరుపతి రైల్వే స్టేషన్‌లో నిర్వహించనున్నారు.తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఈ రైలు తొలి ప్రయాణాన్ని జెండా ఊపి ప్రారంభించను న్నారు.గతంలో 07051/07052 ప్రత్యేక రైలుగా నడిచిన ఈ సేవకు శాశ్వత రూపం కల్పిస్తూ రెగ్యులర్ ఎక్స్‌ప్రెస్ రైలుగా ప్రవేశపెడుతున్నారు.ఈ రైలు తిరుపతి నుంచి బయలుదేరి రేణిగుంట, కడప, గుంతకల్, రాయచూర్, వికారాబాద్ మార్గాల ద్వారా ప్రయాణించి సాయంత్రానికి సికింద్రాబాద్ చేరుకుంటుంది. అనంతరం చర్లపల్లి, కాజీపేట, మంచిర్యాల, బిలాస్‌పూర్, రాంచీ, చిత్తరంజన్ తదితర ప్రధాన స్టేషన్ల మీదుగా సుమారు 2,795 కిలోమీటర్లు ప్రయాణించి రక్సౌల్ జంక్షన్ చేరుకుంటుంది.ఈ వివరాలను మండల వాణిజ్య అధికారి, గుంతకల్ మరియు స్టేషన్ డైరెక్టర్ మోహన కృష్ణ వెల్లడించారు.

# భూపతికి పోలీసు సిబ్బంది, నాయకులు సన్మానం



**నాగలాపురం – ఆంధ్రనాడు, మే 30:** నాగలాపురం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న భూపతి సత్యవేడు పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయినట్లు సబ్ ఇన్స్పెక్టర్ సునీల్ తెలిపారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నాగలాపురం పోలీస్ స్టేషన్‌లో ఐదు సంవత్సరాల పాటు సేవలందించిన అనంతరం సాధారణ బదిలీపై ఆయన సత్యవేడుకు వెళ్తున్నట్లు వెల్లడించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, ప్రజలతో స్నేహపూర్వక వ్యవహారశైలితో భూపతి ప్రత్యేక గుర్తింపు పొందారు. నాగలాపురం మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించడంతో పాటు, ప్రతి ఒక్కరికీ సమానంగా న్యాయం అందేలా కృషి చేశారని స్థానికులు కొనియాడారు. ప్రజల సమస్యలను ఓర్పుతో విని, పోలీస్ శాఖపై విశ్వాసం పెంపొందించేలా పనిచేసిన భూపతి సేవలను పలువురు గుర్తు చేసుకున్నారు. ఇంత మంచి కానిస్టేబుల్ బదిలీపై వెళ్లడం బాధాకరమని, ఆయన భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని స్థానికులు ఆకాంక్షించారు. నాగలాపురంలో ఆయన అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని ప్రజలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాగలాపురం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు టీజేబి ప్రణీత్ రెడ్డి, సురుటుపల్లి శ్రీ పల్లి కొండేశ్వర స్వామి ఆలయ పాలకమండలి సభ్యుడు నెల్సన్ మండేలా కలిసి కానిస్టేబుల్ భూపతిని ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి పూలమాలలు వేసి ఆయన సేవలను అభినందించారు. నాగలాపురంలో ప్రజలకు అందించిన సేవలు ఆదర్శప్రాయమని కొనియాడుతూ, సత్యవేడు పోలీస్ స్టేషన్‌లో కూడా ఇదే విధంగా ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు.

ఆదివారం
31.05.2026
తిరుపతి – చిత్తూరు
అన్నమయ్య– అనంతపురం
ఆంధ్రనాడు

# టైటిల్ వేటకు సై

- రెండో టైటిల్‌పై ఇరు జట్ల గురి
- బెంగళూరుతో గుజరాత్ ఢీ
- రాత్రి 7.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



ఐపీఎల్19 అంతిమ సమరానికి రంగం సిద్ధం. డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, ఆతిథ్య జట్టు గుజరాత్ టైటాన్స్ రెండో టైటిలే లక్ష్యంగా నేడు బరిలోకి దిగుతున్నాయి. గత సీజన్లో ఇక్కడ చాంపియన్‌గా నిలిచిన ఆత్మవిశ్వాసంతో ఆర్సీబీ, సొంతగడ్డ అనుకూలతతో టైటాన్స్ విజయంపై దీమాగా ఉన్నాయి. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్ టైటిల్ పోరు నేడు.

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)19 సీజన్లో అత్యుత్తమ జట్లు టైటిల్ పోరుకు సై అంటున్నాయి. ఒకరిద్దరి ప్రదర్శనపై ఎక్కువగా ఆధారపడకుండా సమిష్టిగా రాణిస్తూ.. ఫైనల్‌కు చేరుకున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ నేడు అంతిమ సమరంలో తాడోపేడో తేల్చుకోనున్నాయి. తొలి టైటిల్ కోసం 18 ఏండ్లు ఎదురుచూసిన బెంగళూరు.. వరుసగా రెండో టైటిల్‌పై కన్నేయగా.. ఐదేండ్లలో మూడోసారి ఫైనల్‌కు చేరుకున్న గుజరాత్ టైటాన్స్ సైతం రెండో టైటిల్‌పై ఆశలు పెట్టుకుంది. గత ఎనిమిది సీజన్లుగా క్వాలిఫయర్1లో నెగ్గిన జట్టునే ఐపీఎల్ ట్రోఫీ వరిస్తోంది. మరి నేడు ఫైనల్లో ఆ సంప్రదాయం కొనసాగుతుందా? టైటాన్స్ ఆ రికార్డును బ్రేక్ చేస్తుందా? ఆసక్తికరం.

### జోరుమీదున్న ఆర్సీబీ

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు భీకర ఫామ్‌లో ఉంది. దేవదత్ పడిక్కల్, రజత్ పటీదార్, వెంకటేశ్ అయ్యర్ విధ్వంసక ఇన్నింగ్స్‌లతో కదం తొక్కుతుండగా.. విరాట్ కోహ్లి నిలకడగా రాణిస్తున్నాడు. భారీ స్కోర్లు నమోదు చేయటం, భారీ లక్ష్యం ఛేదించటం ఆర్సీబీకి వెన్నతో పెట్టిన విద్య!. బలమైన బ్యాటింగ్ లైనప్‌కు బలమైన బౌలింగ్ దళం ఆర్సీబీ అతిపెద్ద బలం. భువనేశ్వర్ కుమార్, హాజిల్‌వుడ్ పవర్‌ప్లేలో, డెత్ ఓవర్లలో గొప్పగా రాణిస్తున్నారు. కృనాల్ పాండ్య, సుయాశ్ శర్మలు మాయ చేసేస్తున్నారు. బ్యాటర్లు, బౌలర్లు సమిష్టిగా రాణిస్తే ఆర్సీబీ వరుసగా రెండో సీజన్లో ఐపీఎల్ చాంపియన్‌గా నిలువటం లాంఛనమే.

### ఆశల పల్లకిలో టైటాన్స్

గుజరాత్ టైటాన్స్ క్వాలిఫయర్1లో ఓడినా.. అహ్మదాబాద్ వేదికగా లీగ్ మ్యాచ్‌లో బెంగళూరును 155 పరుగులకే పరిమితం చేసి గెలుపొందింది. సొంతగడ్డపై టైటాన్స్‌కు తిరుగులేని రికార్డుంది. టైటాన్స్ పేసర్లు కగిసో రబాడ, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ కృష్ణ త్రయం గొప్పగా రాణిస్తున్నారు. రషీద్ ఖాన్, జేసన్ హోల్డర్ మిడిల్ ఓవర్లలో ప్రత్యర్థులకు చుక్కలు చూపిస్తున్నారు. సొంతగడ్డపై బౌలర్లు మెరిస్తే టైటాన్స్‌కు తిరుగుండదు. బ్యాట్‌తో శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్, జోశ్ బట్లర్, వాషింగ్టన్ సుందర్ టైటాన్స్‌కు కీలకం కానున్నారు. భారీ లక్ష్యాలను ఛేదించటంలో టైటాన్స్‌కు మంచి రికార్డు లేదు. క్వాలిఫయర్1 ప్రదర్శన పునరావృతం చేయాలని ఆర్సీబీ చూస్తుండగా.. లీగ్ మ్యాచ్ ప్రదర్శన పునరావృతంపై టైటాన్స్ ఆశలు పెట్టుకుంది.

### పిచ్, వాతావరణం

గత సీజన్ ఐపీఎల్ ఫైనల్ సైతం అహ్మదాబాద్‌లోనే జరిగింది. నిరుడు టైటిల్ పోరుకు ఉపయోగించిన పిచ్‌నే నేటి మ్యాచ్‌కు సిద్ధం చేశారు. ఇదే పిచ్‌పై లీగ్ దశలో టైటాన్స్ చేతిలో ఆర్సీబీ ఓటమి పాలైంది. ఈ పిచ్‌పై రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ అనుకూలం. టాస్ నెగ్గిన జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకునే అవకాశం ఎక్కువ. ఫైనల్ మ్యాచ్‌కు వాతావరణం ఆహ్లాదకరంగా ఉండనుంది. వర్షం సూచనలు లేవని సమాచారం.

### తుది జట్లు (అంచనా)

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు : విరాట్ కోహ్లి, వెంకటేశ్ అయ్యర్/ఫిల్ సాల్ట్, దేవదత్ పడిక్కల్, రజత్ పటీదార్ (కెప్టెన్), కృనాల్ పాండ్య, టిమ్ డెవిడ్, జితేశ్ శర్మ (వికెట్ కీపర్), రోమారియో షెఫర్డ్, భువనేశ్వర్ కుమార్, జోశ్ హాజిల్‌వుడ్, రసిఖ్ సలాం, జాకబ్ డఫ్ఫీ.

గుజరాత్ టైటాన్స్ : శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), బి. సాయి సుదర్శన్, జోశ్ బట్లర్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, నిశాంత్ సింధు, జేసన్ హోల్డర్, రాహుల్ తెవాటియ, రషీద్ ఖాన్, ఆర్. సాయి కిశోర్, కగిసో రబాడ, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ కృష్ణ.



# ఫైనల్లో సాత్విక్ జోడీ

- వరల్డ్ నం.1 జోడీపై సెమీస్‌లో గెలుపు
- సింగపూర్ ఓపెన్ సూపర్ 750


సింగపూర్ : భారత బ్యాడ్మింటన్ అగ్రశ్రేణి షట్లర్లు సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడీ ఈ ఏడాది వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో రెండోసారి ఫైనల్‌కు చేరుకున్నారు. థాయ్‌లాండ్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన సాత్విక్,చిరాగ్‌లు శనివారం సింగపూర్‌లో జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో వరల్డ్ నం.1 దక్షిణ కొరియా షట్లర్లు కిమ్, సియోలపై వరుస గేముల్లో గెలుపొంది సింగపూర్ ఓపెన్ ఫైనల్లోకి ప్రవేశించారు. 52 నిమిషాల్లోనే ముగిసిన సెమీఫైనల్ సమరంలో సాత్విక్,చిరాగ్‌లు 21–19, 21–18తో మెప్పించారు. వరల్డ్ నం.1 దక్షిణ కొరియా జోడీతో మూడు సార్లు తలపడిన సాత్విక్, చిరాగ్‌లు తొలిసారి విజయం సాధించారు. సింగపూర్ ఓపెన్ సూపర్ 750 టోర్నమెంట్ టైటిల్ పోరుకు చేరుకున్నారు. సెమీఫైనల్ సమరంలో రెండు గేముల్లోనే సాత్విక్, చిరాగ్‌లు లాంఛనం ముగించినా.. రెండు గేముల్లోనూ వరల్డ్ నం.4 భారత జోడీ ఆరంభంలో వెనుకంజ వేసింది. తొలి గేమ్‌లో 8–13, 13–17తో సాత్విక్, చిరాగ్‌లు వెనకబడ్డారు. కానీ ఆఖర్లో పుంజుకుని తొలి గేమ్‌ను సొంతం చేసుకున్నారు. రెండో గేమ్‌లో 11–14తో వెనుకంజ వేసినా.. వరుసగా ఆరు పాయింట్లు ఖాతాలో వేసుకుని ఆధిక్యంలోకి వచ్చారు.

అదే ఊపులో రెండో గేమ్‌ను, ఫైనల్ బెర్త్‌ను సొంతం చేసుకున్నారు. 'దక్షిణ కొరియా షట్లర్లు ఉత్తమ డిఫెన్స్ ఆడుతున్నారు. ఎటాకింగ్ గేమ్ ఆడినప్పుడు సంయనం అవసరమని భావించాం. ఆరంభంలో వెనుకబడినా..మా ప్రణాళికకు కట్టుబడి ఉంటే అవకాశం వస్తుందని అనుకున్నామని' సాత్విక్ తెలిపాడు. మరోవైపు మిక్స్‌డ్ డబుల్స్ సెమీఫైనల్లో ధ్రువ్ కపిల, తనీశ క్రాస్టో జోడీకి పరాజయం ఎదురైంది. జపాన్ షట్లర్లు యుచి, సయాకల చేతిలో 16–21, 21–17, 13–21తో మూడు గేముల మ్యాచ్‌లో పోరాడి ఓడారు. నేడు జరిగే మెన్స్ డబుల్స్ ఫైనల్లో రెండో సీడ్ మలేషియా షట్లర్లు మథియస్, అలెగ్జాండ్ర బోయెలతో సాత్విక్, చిరాగ్‌లు పోటీపడనున్నారు.

# విజయ్ గారి పట్ల గర్విస్తున్నాను

## : చెన్నైలో రామ్ చరణ్

చెన్నై తన పుట్టినిల్లు అంటూ రామ్ చరణ్ భావోద్వేగం
దర్శకుడు బుచ్చిబాబు వల్లే సినిమాపై అమితమైన ప్రేమ పెరిగిందన్న చరణ్
కెరీర్ పీక్స్‌లో ఉండగా ప్రజాసేవకు వచ్చిన విజయ్‌ను అభినందించిన మెగా హీరో
ఏఆర్ రెహమాన్, శివరాజ్‌కుమార్ వంటి లెజెండ్స్‌తో పనిచేయడం అదృష్టమని వ్యాఖ్య
కుస్తీ సన్నివేశంలో చేతికి గాయమైందని, దాన్ని బుచ్చిబాబు ఇచ్చిన గిఫ్ట్‌గా భావిస్తానన్న చరణ్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ 'పెద్ది' చిత్రం ప్రమోషన్ల కోసం చెన్నైలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చెన్నైతో తనకున్న విడదీయరాని బంధాన్ని గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. తన కెరీర్, కొత్త సినిమా, సహనటులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా తమిళనాడు ముఖ్యమంత్రి, నటుడు విజయ్‌పై చేసిన ప్రశంసలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

### చెన్నైతో విడదీయరాని బంధం

చెన్నైకి వచ్చినప్పుడల్లా తనకు మాటలు రావని, ఒకరకమైన భావోద్వేగంలో ఉండిపోతానని రామ్ చరణ్ అన్నారు. "నేను పుట్టింది, పెరిగింది ఇక్కడే. మా అమ్మగారిది కూడా ఈ నగరమే. అందుకే చెన్నైకి వస్తే నా సొంత ఇంటికి వచ్చిన అనుభూతి కలుగుతుంది. మగధీర, ఆర్ఆర్ఆర్ వంటి సినిమాల ప్రమోషన్లకు వచ్చినప్పుడు కూడా ఇదే ఫీలింగ్ కలిగింది" అని ఆయన తెలిపారు. వేదికపై ఉన్న ఎందరో లెజెండ్స్ ముందు మాట్లాడటం సంతోషంగా ఉందన్నారు.

### ఇది కష్టం కాదు.. ఇష్టంతో చేసిన సినిమా

తన కొత్త సినిమా గురించి మాట్లాడుతూ, ఇది ఎంతో ఇష్టపడి, ప్రేమించి చేసిన చిత్రమని చరణ్ స్పష్టం చేశారు. "ఈ సినిమా కోసం మేమంతా రెండున్నరేళ్లుగా దాదాపు 285 రోజులు పనిచేశాం. కానీ మా దర్శకుడు బుచ్చిబాబు మాత్రం గత ఐదారేళ్లుగా ఈ కథపైనే జీవిస్తున్నారు. సుకుమార్ గారు నాకు బుచ్చిబాబు లాంటి అద్భుతమైన రైటర్‌ను పరిచయం చేసినందుకు ఆయనకు ధన్యవాదాలు. ఈ చిత్రానికి ఏ.ఆర్. రెహమాన్ గారు సెంట్రల్ పిల్లర్ లాంటి వారు," అని వివరించారు. షూటింగ్ తర్వాత ప్రతిరోజూ ఇంటికి వెళ్లి సినిమా గురించి ఆపకుండా మాట్లాడేవాడినని, రంగస్థలం, ఆర్ఆర్ఆర్ తర్వాత మళ్లీ అంతగా ప్రేమించిన సినిమా ఇదని, ఇది కచ్చితంగా బ్లాక్‌బస్టర్ అవుతుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

### లెజెండ్స్‌పై ప్రశంసల వర్షం

ఈ చిత్రంలో పనిచేసిన లెజెండ్స్‌ను చరణ్ ప్రత్యేకంగా అభినందించారు. శివరాజ్‌కుమార్ గురించి మాట్లాడుతూ, "ఆయన స్క్రీన్‌పైకి వస్తే నిప్పుల వర్షం కురిసినట్టు ఉంటుంది. జైలర్ సినిమాలో ఆయన నటన ఐకానిక్" అని కొనియాడారు. సినిమాటోగ్రాఫర్ రత్నవేలుతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, ఆయన విజువల్స్ అద్భుతంగా ఉంటాయని ప్రశంసించారు. జాన్వీ కపూర్ తన నటనతో సినిమాకు కొత్త రంగు అద్దారని, ఆమె ఎంతో సిన్సియర్ నటి అని అన్నారు.

### బుచ్చిబాబు గిఫ్ట్, విజయ్‌కి అభినందనలు

ఈ సినిమా కోసం మూడు రకాల శారీరక మార్పులకు లోనయ్యానని, అయితే దర్శకుడు బుచ్చిబాబును డీల్ చేయడమే తనకు అతిపెద్ద ఛాలెంజ్‌గా అనిపించిందని చరణ్ చమత్కరించారు. కుస్తీ సన్నివేశాల చిత్రీకరణలో తన చేతికి గాయమైందని, దానిని బుచ్చిబాబు తనకు ఇచ్చిన అందమైన బహుమతిగా భావిస్తున్నానని నవ్వుతూ చెప్పారు.

అనంతరం తమిళనాడు సీఎం విజయ్ గురించి మాట్లాడుతూ, "కెరీర్ శిఖర స్థాయిలో ఉన్నప్పుడు, ఇంత స్టార్‌డమ్ ఉన్న సమయంలో వాటన్నింటినీ వదిలి ప్రజాసేవ కోసం ముందుకు రావడం స్ఫూర్తిదాయకం. ఒక ఫిల్మ్ ఇండస్ట్రీ వ్యక్తిగా ఆయనను చూసి గర్వపడుతున్నాను" అని రామ్ చరణ్ అభినందనలు తెలిపారు._లకు కూడా స్ఫూర్తినిచ్చేలా ఉంటుందని, తన లైబ్రరీలో జీవితాంతం గుర్తుండిపోయే చిత్రం అని తెలిపారు.

# 'సేవ్ ది టైగర్స్ 3' ట్రైలర్ విడుదల.. నవ్వుల సునామీ పక్కా!

- సేవ్ ది టైగర్స్ 3' సిరీస్ ట్రైలర్ విడుదల
- జూన్ 19 నుంచి డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్
- ఈసారి కథలో ఫాంటసీ టచ్.. ఇంద్రుడిగా వెన్నెల కిషోర్
- ఎమ్మెల్యే, సీఈవోలుగా మారిన స్నేహితుల బృందం
- వినోదాన్ని రెట్టింపు చేసేలా సరికొత్త కథనం



తెలుగు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించిన వెబ్ సిరీస్ 'సేవ్ ది టైగర్స్' మూడో సీజన్‌తో మళ్లీ వచ్చేస్తోంది. ఇప్పటికే రెండు సీజన్లు బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచి, భార్యాబాధితుల కథకు విశేష ఆదరణ తెచ్చిపెట్టాయి. తాజాగా, ఈ సిరీస్ మూడో సీజన్‌కు సంబంధించిన వినోదభరితమైన ట్రైలర్‌ను విడుదల చేశారు. జూన్ 19 నుంచి ఈ సిరీస్ డిస్నీప్లస్ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది.

ట్రైలర్ ఆద్యంతం నవ్వులు పూయించేలా ఉంది. "పెళ్లి గురించి మనకు చిన్నప్పటి నుంచి అబద్ధాలే చెప్పారు" అంటూ అభినవ్ గోమటం చెప్పే డైలాగ్‌తో ట్రైలర్ మొదలవుతుంది. పెళ్లిళ్లపై తమ గోడు వెళ్లబోసుకుంటున్న ముగ్గురు స్నేహితులు ఘంటా రవి (ప్రియదర్శి), రాహుల్ (అభినవ్ గోమటం), విక్రమ్ (చైతన్య కృష్ణ) సంభాషణలతో కథనం సరదాగా సాగుతుంది. "మ్యారేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్ అన్న వాడు నాకు దొరికితేనా" అని విక్రమ్ అనగానే, స్వర్గంలో ఇంద్రుడి పాత్రలో వెన్నెల కిషోర్ ప్రత్యక్షమవడంతో కథ ఫాంటసీ మలుపు తీసుకుంటుంది.

ఆ తర్వాత, ముగ్గురు స్నేహితుల జీవితాలు అనూహ్యంగా మారిపోతాయి. ఘంటా రవి ఎమ్మెల్యేగా, రాహుల్ గొప్ప రచయితగా, విక్రమ్ ఓ పెద్ద కంపెనీకి సీఈవోగా కనిపిస్తారు. ఇది నిజమా లేక మరో ప్రపంచంలో జరుగుతోందా అనే గందరగోళం ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ట్రైలర్‌ను బట్టి చూస్తే, ఈసారి ఫాంటసీ అంశాలను జోడించి వినోదాన్ని నెక్ట్స్ లెవెల్‌కు తీసుకెళ్లినట్టు స్పష్టమవుతోంది.

ప్రియదర్శి, అభినవ్, చైతన్య కృష్ణతో పాటు పావని గంగిరెడ్డి, జోర్దార్ సుజాత, దేవియాని శర్మ తమ పాత్రలతో మరోసారి అలరించడానికి సిద్ధమయ్యారు. మహి వి. రాఘవ్, ప్రదీప్ అద్వైతం క్రియేటర్లుగా వ్యవహరిస్తున్న ఈ సిరీస్‌కు శ్రీరామ్ ఎరగం దర్శకత్వం వహించారు. ట్రైలర్ చూస్తే కామెడీకి మాత్రం లోటు ఉండదని భరోసా ఇస్తోంది.

# గంజాయి రహిత సమాజం కోసమే ఈగల్ "ఫోర్స్ "ఏర్పాటు

## - గంజాయి నిర్మూలన అవగాహన కార్యక్రమంలో పుత్తూరు డిఎస్పి రవికుమార్



**సత్యవేడు - ఆంధ్రనాడు, మే 30:** గంజాయి వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించి గంజాయి రహిత సమాజం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఈగల్ ఫోర్స్, యాంటీ గంజాయి టీమ్స్ వంటి ప్రత్యేక విభాగాలను రంగంలో దించినట్టు పుత్తూరు డిఎస్పి రవికుమార్ చెప్పారు. శనివారం సత్యవేడు వి.ఎం.కె కళ్యాణమండపంలో సీఐ మురళి నాయుడు అధ్యక్షతన గంజాయి నిర్మూలనపై పలువురు యువకులకు అవగాహన, కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి రవికుమార్ మాట్లాడుతూ గంజాయి సేవించడం వల్ల యువకులలో నేర ప్రవృత్తి అధికమవుతున్నట్టు చెప్పారు. దీన్ని సమూలంగా నిర్మూలించాలన్న ఉద్దేశంతో గంజాయి వాడకం, రవాణా, విక్రయాలను అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పోలీస్ శాఖ చేపట్టిన నిఘా, అవగాహన కార్యక్రమం అన్నారు. ప్రత్యేక డ్రగ్ డిటెక్షన్ కిట్ల ద్వారా ఎవరైనా సరే గంజాయి సేవించారా లేదా అన్నది ఒక్క నిమిషంలో నిర్ధారించవచ్చును అన్నారు. ఇది గంజాయి సేవించిన 50 రోజులలోపు పరీక్ష ద్వారా తేలుతుందన్నారు. తొలుత గంజాయికి బానిసలైన వారిని గుర్తించి కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించడంతోపాటు కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. తొలిసారి గంజాయి వాడినట్టు తేలిన ఎటువంటి కేసులు నమోదు చేయమన్నారు. అయితే మళ్లీ రెండోసారి పరీక్షల్లో గంజాయి వాడినట్టు తెలిస్తే కేసు నమోదు చేసి జైలుకు పంపడం జరుగుతుందన్నారు. ఆరోగ్యకర సమాజం కోసం యువత పాత్ర ముఖ్యమన్నారు. అందువల్ల గంజాయికి బానిసలై వారి జీవితంతో పాటు కుటుంబ పరిస్థితులు కూడా ఛిద్రం చేసుకోవద్దని కోరారు. యువతను గంజాయి బానిస నుంచి దూరం చేయాలన్న ఉద్దేశంతోనే జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయి నిర్మూలన పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అయితే సత్యవేడు ప్రాంతంలో గంజాయి వినియోగం అధికంగా ఉన్నట్టు సమాచారం ఉన్నందువల్ల బస్సు యాత్ర ద్వారా ప్రత్యేక కిట్లతో యువకులను పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. సీఐ మురళి నాయుడు మాట్లాడుతూ కిట్లు పరీక్షలు ద్వారా కేవలం గంజాయి సేవించిన వారిని గుర్తించడమే కాక, వారికి గంజాయి ఎక్కడినుంచి సరఫరా అవుతున్నది, ఎవరు అందిస్తున్నారు అన్నది ఆరా తీయడం ద్వారా గంజాయి వినియోగం సమూలంగా నిర్మూలించే అవకాశాలు ఉందన్నారు.

గంజాయి సేవించడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యంపై తీవ్రమైన దుష్ప్రభావాలు పడతాయన్నారు. ముఖ్యంగా జ్ఞాపకశక్తి మందగించడం, ఊపిరితిత్తుల సమస్యలు, నిరాశ, వ్యసనపరుడయ్యే ప్రమాదం ఉందన్నారు. తదనంతరం సత్యవేడులో 20 మందికి కిట్లు ద్వారా పరీక్షలు నిర్వహించగా ముగ్గురికి పాజిటివ్గా తేలగా, నాగలాపురం నుంచి 17 మందిని పరీక్షలు నిర్వహించగా ఇద్దరికీ పాజిటివ్, వరదయ్యపాలెం నుంచి 15 మందికి పరీక్షలు నిర్వహించగా నాలుగు పాజిటివ్ కేసులు నమోదు అయినట్టు ఈ సందర్భంగా స్థానిక ఎస్సై సాయినాథ్ చౌదరి పేర్కొన్నారు. యువకుల మూత్రాన్ని శాంపిల్ తీసుకొని కిట్లు ద్వారా పరీక్షలు నిర్వహించారు. అనంతరం డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో యువకులకు గంజాయి వాడకం వల్ల ఏర్పడే శారీరక రుగ్మత వంటి పలు అంశాలపై కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. ఈ అవగాహన కార్యక్రమంలో ఎస్సైలు సాయినాథ్ చౌదరి, లావణ్య, మల్లికార్జున, సునీల్, పోలీస్ సిబ్బంది, పలువురు యువకులు పాల్గొన్నారు.

# జూనియర్ లైన్ మాన్ నిర్లక్ష్యం






**నాగలాపురం - ఆంధ్రనాడు, మే 30:** నాగలాపురం మండలం విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం గ్రామాలలో స్పష్టంగా కనిపిస్తున్నది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామాలలో ప్రజలకు, రైతులకు విద్యుత్ పరంగా ఎటువంటి సమస్యలు లేకుండా చూసుకోవాలని వారంలో రెండు రోజులు ప్రతి మంగళవారం, శుక్రవారం కరెంటోళ్ల జనబాట కార్యక్రమం నిర్వహించేటట్టుగా ఆదేశాలను జారీ చేశారు. అదేవిధంగా ప్రతి నెల రెండవ శనివారం విద్యుత్ లైన్లు మరమ్మత్తుల కోసం ప్రజలకు విద్యుత్ అంతరాయం కలిగించేవారు. కానీ వారంలో రెండు రోజులు, నెలలో ఒకరోజు జూనియర్ లైన్ మాన్ లో సక్రమంగా వారి విధులు నిర్వహిస్తే ఇలాంటి దృశ్యాలు ప్రజలకు కనుచూపుమేరకు కనబడవు. కానీ ఈ దృశ్యాలను చూస్తే విద్యుత్ శాఖ అధికారులు ఏ విధంగా విధులు నిర్వహిస్తున్నారో అర్థమవుతున్నది అంటున్న ప్రజలు. ఈ దృశ్యం గొల్లవారి కండ్రిగ గ్రామంలో ఆర్ అండ్ బి రోడ్డు పక్కన 5 అడుగుల దూరంలో, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకి 20 అడుగుల దూరంలో పసి పిల్లలు చేయి పెడితే అందే విధంగా విద్యుత్ స్తంభానికి మీటర్ను అమర్చిన జూనియర్ లైన్ మాన్ శరవన. ఇతని నిర్లక్ష్యం వల్ల ఇప్పటికే రెండు నిండు ప్రాణాలు కోల్పోవడం జరిగింది. ఇంకా ఎన్ని ప్రాణాలు కోల్పోయే వరకు ఇలాంటి దృశ్యాలు కనిపిస్తేనే ఉంటాయో??? ఇప్పటికైనా నాగలాపురం ఏఈ పృథ్వి స్పందించి ఇలాంటి విద్యుత్ మీటర్లను స్తంభాలు వ్యక్తులకు, పసిపిల్లలకు అందనంత ఎత్తులో అమర్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# తాత, మనవడుపై కేసు నమోదు

నాగలాపురం - ఆంధ్రనాడు, మే 30: నాగలాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన రెండు వేర్వేరు కేసులలో నిందితులుగా నాగలాపురం మండలం కస్తూరినాయుడు కండ్రిక గ్రామస్తులు సుబ్రహ్మణ్యం, అతని మనవడు కె.రాజేష్లపై చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు సబ్ ఇన్స్పెక్టర్ సునీల్ తెలిపారు. కె.రాజేష్ వాట్సాప్ ద్వారా రాజకీయ వర్గాల మధ్య వైషమ్యాలు, ఉద్రిక్తతలు, శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా రెచ్చగొట్టే పోస్టులు చేసినట్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అతడిని అరెస్టు చేయడంతో పాటు కే.రాజేష్ మొబైల్ ఫోన్ను స్వాధీనం చేసుకొని డిజిటల్ ఆధారాల పరిశీలన కోసం ఎఫ్.ఎస్.ఎల్కు పంపేందుకు చర్యలు చేపట్టామని, అలాగే సురుటుపల్లి పంచాయతీ పరిధిలోని ఆరణియార్ ప్రాజెక్టు కాలువ గట్టుపై ఉన్న ప్రభుత్వ చెట్లను అక్రమంగా నరికివేసిన ఘటనపై ఆరణియార్ ప్రాజెక్టు సెక్షన్ పిచ్చాటూరు సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ బి.సి.ధరణి కుమార్ ఫిర్యాదు మేరకు సుబ్రహ్మణ్యం, కె. రాజేష్ లపై భారతీయ న్యాయ సంహిత (దీచీా), ప్రజా ఆస్తుల నష్టం నిరోధక చట్టం (గ్రాఋూా-చాష్), ఆంధ్రప్రదేశ్ వాటర్, ల్యాండ్ అండ్ ట్రీస్ యాక్ట్ (ఘ్రాఔూూూా చాష్) నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా సబ్ ఇన్స్పెక్టర్ సునీల్ మాట్లాడుతూ... సామాజిక మాధ్యమాలలో విద్వేషాలు, వైషమ్యాలు రెచ్చగొట్టే పోస్టులు చేయడం, అసత్య ప్రచారాలు నిర్వహించడం, అలాగే ప్రభుత్వ భూములు, కాలువ గట్లు, చెట్లు, ఇతర ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడం, అక్రమంగా నరికివేయడం శిక్షార్హమైన నేరాలని, ఇటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




Printed, Published Edited and Owned by M.HARIBABU, Printed at AKSHARA PRINTERS, 1st Floor, SSS Complex, Air Bypass Road, Tirupati Town, Tirupati District, A.P., Published at AKSHARA PUBLICATIONS, Tirupati, Editor : M.Hari Babu , Cell : 9490400684, RNI: 2009/28733